విశాఖపట్టణం

శుక్రవారం 25 ఏప్రిల్ 2025

For a pure tomorrow..

# జయహే

jayajayahey. in

సంపుటి : 8 సంచిక : 169

వెల : రూ.5/- పేజీలు : 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




## పంచాయతీల్లో జాతీయ సమగ్రతా ప్రాంగణాలు, స్థూపాలు ఏర్పాటు

పహల్గామ్ ఉగ్రదాడి ఘటన..

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

మధుసూదనరావుకి నివాళి అర్పించిన పవన్ కళ్యాణ్

**అమరావతి:**

పహల్గామ్‌లో ఉగ్రదాడి ఘటన తీవ్రంగా కలచి వేసిందని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఉగ్రవాదుల తూటాలకు దేశమంతా కన్నీళ్లు పెడుతుందన్నారు. విశాఖలో రిటైర్డ్ ఎంప్లాయి, కావలిలో యువకుడు చనిపోవడం బాధాకరమంటూ పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పవన్%%% పహల్గామ్ మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. జాతీయ సమైక్యతను పెంపొందించేలా.. అన్ని పంచాయతీల్లో జాతీయ సమగ్రతా ప్రాంగణాలుండాలని చెప్పారు. 13వేల 326 పంచాయతీల్లో జాతీయ సమగ్రతా ప్రాంగణాలు, స్థూపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మధుసూదనరావు నివాసానికి పవన్ కళ్యాణ్: ఏపీ ఉపముఖ్యమంత్రి - మిగతా2లో

# ఏఐలోనూ మానవీయత ముఖ్యం

స్మార్ట్ పాలనకు ప్రాధాన్యత

భారీ డాటా లేక్ ఏర్పాటు చేస్తాం

సీఎం చంద్రబాబు వెల్లడి



**అమరావతి:**

పాలనలో ఏఐని వినియోగించినా మానవీయకోణం ముఖ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం నాడు సచివాలయంలో నిర్వహించిన ఏఐ వర్క్‌షాప్‌లో సీఎం మాట్లాడుతూ.. టెక్నాలజీ వినియోగంతో రియల్ టైమ్‌లో సేవలను డెలివరీ చేయొచ్చన్నారు. స్మార్ట్ పాలనకు ప్రాధాన్యత ఉంటుందని, త్వరలో భారీ డేటా లేక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూనే, ప్రజలకు సేవల విషయంలో మానవీయకోణం చూపాలని చెప్పుకొచ్చారు. ఏఐ ఆధారిత స్మార్ట్ వ్యవస్థ ఏర్పాటుతో రియల్ టైమ్‌లో సేవలు అందించవచ్చని చెప్పారు. ఇందుకోసం పాత విధానాల స్థానంలో నూతన సాంకేతికతను ప్రవేశపెట్టాలన్నారు. టెక్నాలజీ అనేది ప్రజల కోసం ఉపయోగపడాలన్నారు. రాష్ట్రంలో భారీ డేటా లేక్‌ను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టామని తెలిపారు. 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైన ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. 2 ఎంబీపీఎస్ ఇంటర్నెట్ కోసం ఎదురుచూసిన రోజుల నుంచి డేటా ఆధారిత పాలన దిశగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దామన్నారు. వేగంగా భూరికార్డుల డిజిటలైజేషన్ చేయాలని వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చే - మిగతా2లో

# దేశం విడిచి వెళ్లిపోండి



వారం రోజులే గడువు

పాక్ దేశస్తులకు కేంద్రం వార్నింగ్

వీసాల జారీ నిలిపివేత.. ఉన్నవి రద్దు

అమల్లోకి కఠిన నిబంధనలు

**ప్రత్యేక ప్రతినిధి జయజయహే**

కశ్మీర్‌లోని పహల్గాంలో భారత టూరిస్టులపై ఉగ్రదాడిపై భారత్ కఠినంగా స్పందిస్తోంది. తాజాగా గురువారం కేంద్ర ప్రభుత్వం పాకిస్తానీ జాతీయులకు వీసా సేవలను తక్షణమే నిలిపివేసింది. అన్ని రకాల వీసాలను రద్దు చేస్తున్నట్లుగా ప్రకటించింది. దేశంలో పాకిస్తానీ జాతీయులు భారతదేశం విడిచి వెళ్లాలని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. - మిగతా2లో

# తిరుమలలో హై అలెర్ట్

ఉగ్రదాడులతో టీటీడీ అప్రమత్తం

భద్రత మరింత పటిష్టం

విస్తృతంగా తనిఖీలు.. చెక్ పోస్టులు

**ప్రత్యేక ప్రతినిధి జయజయహే**

జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో అనేక మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఇద్దరు విదేశీయులు సహా మొత్తం 28 మంది వరకు మరణించగా.. ఎంతో మంది జీవితాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఉగ్రదాడి ఘటనతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ నేపథ్యంలో భారత్‌లోని పలు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల వద్ద భద్రతను పెంచాయి. - మిగతా2లో



# కూలీలు అనొద్దు.. శ్రామికులని పిలుద్దాం

స్వయంప్రతిపత్తితో గ్రామస్వరాజ్యం

గ్రామ పంచాయతీలు ఆర్థిక స్వావలంబన

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు

జాతీయ గ్రామ పంచాయతీరాజ్ దినోత్సవానికి హాజరు

**ప్రత్యేక ప్రతినిధి జయజయహే**




'గ్రామ పంచాయతీలు స్వయంప్రతిపత్తితో ముందుకు సాగినపుడే ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ సమన్వయంతో ఐక్యంగా పని చేయాలి. అన్ని రంగాల్లో స్వయం ప్రతిపత్తిని సాధించాలి. అభివృద్ధి, ఆకాంక్షలు కలగలిపి స్వర్ణ గ్రామాలుగా వెలగాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "నాకు పల్లెలు అంటే ప్రాణం. పల్లెల్లో బతకాలని బలంగా ఉండేది. కానీ సాధ్యపడలేదు. కూటమి ప్రభుత్వంలో చాలా ఇష్టంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను చేపట్టాను. శాఖలను - మిగతా2లో



# థాంక్యూ.. జగన్ సార్

నాకు ఈ హోదా ఇచ్చింది మీరే

మళ్లీ రాజకీయాల్లో యాక్టివ్ అవుతా

సస్పెన్షన్ పై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ స్పందన

**ప్రత్యేక ప్రతినిధి జయజయహే**

వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ వైఎస్ జగన్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. పార్టీ క్రమ శిక్షణ ఉల్లంఘనకు పాల్పడినట్లు దువ్వాడపై ఫిర్యాదులు రావడంతోనే ఈ చర్య తీసుకున్నారు. తాజాగా తన సస్పెండ్‌పై దువ్వాడ శ్రీనివాస్ స్పందించారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో రిలీజ్ చేశారు. అందులో శ్రీనివాస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నాకు ఈ స్థాయిని, హోదాను, ఇంతటి గౌరవాన్ని ఇచ్చిన వైఎస్ జగన్మోహన్ రెడ్డికి - మిగతా2లో

# ముమ్మాటికీ భద్రతా లోపమే

ఇంటెలిజెన్స్ ఫెయిల్యూర్

దేశ భద్రతను గాలికి వదిలేసారు

మోడీ, షా రాజీనామా చేయాలి

పీసీసీ చీఫ్ షర్మిల మండిపాటు

చంద్రమౌళి కుటుంబానికి పరామర్శ

**ప్రత్యేక ప్రతినిధి జయజయహే**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి మనం దేశం మీద జరిగిన దాడి అని ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల అన్నారు. దేశంలో శాంతి భద్రతలు గొప్పగా ఉన్నాయని ప్రధాని మోడీ ఒక క్యాంపెయిన్ నడిపారని.. పెద్ద పెద్ద బోర్డులు పెట్టారని అన్నారు. ఇది చూసి ఏటా 2 కోట్ల మంది కశ్మీర్ కి వెళుతుంటారన్నారు. ఇలాంటి ప్రాంతంలో సెక్యూరిటీ లోపం ఎందుకు? అని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికి భద్రత లోపమేనని ధ్వజమెత్తారు. టూరిస్టులపై కాల్పులు జరుపుతుంటే - మిగతా2లో



# నిర్ధాక్షిణ్యంగా ఏరివేయాలి





**దారుణ కిరాతకానికి పాల్పడ్డారు**

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆగ్రహం**

**నెల్లూరులో మధుసూథన రావుకు నివాళులు**

జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూదనరావుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నివాళులర్పించారు. గురువారం కావలి చేరుకున్న పవన్.. నేరుగా మధుసూదనరావు ఇంటికి వెళ్లి.. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆపై కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. కాశ్మీర్‌లో కిరాతకంగా తూటాలు పేలిస్తే, దేశ వ్యాప్తంగా మధుసూదనరావుకు నివాళులర్పించారన్నారు. ఈ సంఘటనను కుటుంబ సభ్యులు ఇంకా నమ్మలేకపోతున్నారని తెలిపారు. వారితో మాట్లాడినప్పుడు... ఆయన భార్య, పిల్లలు ఏం జరిగింది.. ఎలా జరిగిందో చెప్పారన్నారు. వాళ్లు చెబుతుంటే తనకే పేగులు మెలబెట్టినట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ధర్మాన్ని ఆచరిస్తారని తెలుసుకుని హతమార్చారంటే ఎంతటి దారుణమని మండిపడ్డారు. తాను మాట్లాడలేక పోతున్నానని.. రేపో, ఎల్లుండో మంగళగిరిలో ప్రెస్‌మీట్ పెట్టి అన్ని వివరిస్తానని తెలిపారు. శుక్రవారం వైజాగ్ కూడా వెళుతున్నానని చెప్పారు. ఎంత శాడిస్టికల్‌గా, మెతడాలికల్‌గా, కోల్డ్ బ్లెడ్‌గా చంపేశారన్నారు. కాశ్మీర్ రెండేళ్లుగా ప్రశాంతంగా ఉందనే ఇంతటి దారుణానికి, కిరాతకానికి పాల్పడ్డారని మండిపడ్డారు. సమ్మర్‌లో షూటింగ్ కోసం కాశ్మీర్‌కు చాలా సార్లు వెళ్లానని.. అక్కడ పరిస్థితులు తనకు తెలుసన్నారు. ఉగ్రవాదులు ఎక్కడున్నా నిర్ధాక్షిణ్యంగా ఏరేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పవన్ వెంట మంత్రులు ఆనం, నాదెండ్ల, సత్యకుమార్, ఎమ్మెల్యేలు కావ్యా కృష్ణారెడ్డి, సోమిరెడ్డి, ఆర్ఎస్ఎస్ జాతీయనేత మధుకర్ ఉన్నారు.

## బాబుపై కేసులు క్లోజ్

**అంగళ్లలో గతంలో రాళ్ల దాడులు**

**తప్పుడు కేసులను కేసులు మూసివేత**

చిత్తూరు జిల్లా అంగళ్లు సమీపంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబుపై జరిగిన రాళ్ల దాడి ఘటనల్లో నమోదైన కేసులను పోలీసులు మూసివేశారు. పూర్తి స్థాయిలో విచారించిన తర్వాత ఆయనపై చేసినవి తప్పుడు ఫిర్యాదులుగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ప్రతిపక్ష నేత హెూదాలో 2023 ఆగస్టు 9న చంద్రబాబు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనకు వచ్చారు. కురబలకోట మండలం అంగళ్లు సర్కిల్‌లో చంద్రబాబు వాహనాన్ని వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. చంద్రబాబుపైకీ రాళ్లు రువ్వారు. భద్రతా సిబ్బంది సకాలంలో స్పందించి అడ్డుకోవడంతో ఆయనకు ఎటువంటి గాయాలూ కాలేదు. ప్రాజెక్టుల సందర్శనకు వస్తున్న చంద్రబాబుకు వినతిప్రతం ఇచ్చేందుకు తాము వెళ్తుంటే.. టీడీపీ నాయకులు తమపై మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారని, చంద్రబాబు రెచ్చగొట్టడం వల్లే ఈ దాడులు జరిగాయని వైసీపీకి చెందిన ఉమాపతిరెడ్డి మూడు రోజుల తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముదివేడు పోలీసులు చంద్రబాబుపై ఏకంగా హత్యాయత్నం సహా పలు నాన్‌బెయిలబుల్ సెక్షన్లతో నాలుగు కేసులు నమోదు చేశారు. మాజీ మంత్రులు దేవినేని ఉమ, అమరనాథ్‌రెడ్డి సహా 20 మంది క్రియాశీల టీడీపీ నాయకులపైనా కేసులు పెట్టారు. తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాలకు పలువురు క్రియాశీల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీసులు పూర్తి స్థాయిలో విచారించారు. చంద్రబాబు పర్యటనను వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడమే కాకుండా.. ఆయనపై రాళ్లు రువ్వినట్లు వీడియోల ద్వారా గుర్తించారు. దాడులకు దిగిన వారిపై కేసులు నమోదు చేయకపోగా బాధితుడిగా ఉన్న చంద్రబాబుపైన, ఇతర టీడీపీ నాయకులపై కేసులు బనాయించినట్లు గుర్తించారు. హత్యాయత్నం కేసుతో పాటు.. మిగిలిన మూడు కేసులూ తప్పుడువేనని తేల్చి వాటిని మూసివేస్తూకోర్టుకు నివేదిక సమర్పించారు.

## విడదల రజినీ మరిది అరెస్టు

## క్వారీల బ్లాక్ మెయిల్ పై కేసు



మాజీ మంత్రి, వైసీపీ మహిళా నేత విడుదల రజనికి బిగ్ షాక్ తగిలింది. ఆమె మరిది గోపిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. హైదరాబాద్ లో ఆయన్ను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు.. విజయవాడకు తరలిస్తున్నారు. యడ్లపాడు కంకర క్వారీ యజమానులను బెదిరించి డబ్బులు వసూలు చేశారని రజినితోపాటు గోపీపై కేసు నమోదైంది. ఈ క్రమంలోనే అతడ్ని ఏసీబీ అధికారులు హైదరాబాద్ లో అరెస్టు చేశారు. గోపిని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ గచ్చిబౌలిలో ఏపీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విడదల గోపినాథ్ ను అరెస్ట్ చేసి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ కు తరలించారు. గచ్చిబౌలి పోలీసులకు సమాచారం ఇచ్చి ఏపీకి తీసుకెళ్లారు. స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి డబ్బులు తీసుకున్న ఘటనపై కేసు నమోదు చేసిన ఏసీబీ.. తాజాగా అరెస్ట్ చేసింది. కాగా.. మాజీ మంత్రి విడదల రజనిపై ఏసీబీ ఈ ఏడాది మార్చిలో కేసు నమోదు అయింది. 2020లో పల్నాడు జిల్లా యడ్లపాడులోని శ్రీలక్ష్మీబాలాజీ స్టోన్ క్రషర్ యాజమ్యాన్నాని విజిలెన్స్ తనిఖీల పేరుతో బెదిరించారని అభియోగాలు ఉన్నాయి. స్టోన్ క్రషర్ యాజమాన్యాన్ని బెదిరించి రూ.2.20 కోట్లు వసూలు చేశారని ఆమెపై ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో విడదల రజనీపై కేసు నమోదు చేశారు. ఆమెను ఈ కేసులో ఏ1గా చేర్చారు ఏసీబీ అధికారులు. ఏ2గా ఐపీఎస్ అధికారి జాషువా పై కేసు నమోదు చేశారు. ఏ3గా గోపి, ఏ4గా రజనీ పీఏ దొడ్డ రామకృష్ణలను నిందితులుగా చేర్చింది. విడదల రజని వాటా 2 కోట్లు ఇచ్చినట్టు కేసు నమోదు చేయగా.. ఆమె మరిది గోపి, జాషువాలకు చెరో 10 లక్షలు ఇచ్చినట్లు కేసు నమోదు చేశారు.

## దేశం విడిచి వెళ్లిపోండి

-మొదటిపేజీ తరువాయి

భారతీయులు పాకిస్తాన్‌కు వెళ్లద్దని కూడా ఎంఈఏ సూచించింది. 27వ తేదీలోపు అందరూ వెళ్లాల్సి ఉంటుంది. పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ తీసుకున్న నిర్ణయాలను అమల్లోకి తెస్తున్నారు. ఆ సమావేశంలో పాకిస్తాన్ జాతీయులకు వీసా సేవలను తక్షణమే నిలిపివేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. పాకిస్తాన్ జాతీయులకు భారతదేశం జారీ చేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు 27 ఏప్రిల్ 2025 నుండి రద్దు చేశారు. పాకిస్తాన్ జాతీయులకు జారీ చేసిన వైద్య వీసాలు 29 ఏప్రిల్ 2025 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఈ లోపు అందరూ దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుంది. ప్రకటించిన వీసా గడువు ముగిసేలోపు భారతదేశంలో ఉన్న అన్ని పాకిస్తానీ జాతీయులు దేశం విడిచి వెళ్లాలని ఎంఈఏ ప్రకటన పేర్కొంది. పాకిస్తాన్‌లోని అన్ని భారతీయులను ప్రభుత్వం వెంటనే తిరిగి రావాలని కోరింది. భారతీయ పౌరులు పాకిస్తాన్‌కు వెళ్లకుండ ఉండాలని ప్రభుత్వం సలహా ఇచ్చింది. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న భారతీయ పౌరులు కూడా వీలైనంత త్వరగా భారతదేశానికి తిరిగి రావాలని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఉగ్రదాడికి పాకిస్తాన్ మద్దతు ఉందని స్పష్టం కావడంతో భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సీమాంతర ఉగ్రవాదానికి ముగింపు పలికే వరకు పాక్‌తో సింధూ నదీ జలాల ఒప్పందం నిలిపివేయాలని నిర్ణయం తీసుకుంది. సార్క్ వీసా మినహాయింపు పథకం ద్వారా మన దేశంలో పర్యటిస్తున్న పాకిస్థాన్ జాతీయులకు అనుమతుల రద్దు చేశారు. ఈ నిర్ణయాన్ని అమల్లోకి తెచ్చారు. భారత్‌లోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయాల్లో పనిచేస్తోన్న ఆ దేశ సైనిక సిబ్బంది, అధికారులను అవాంఛిత వ్యక్తులుగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది. దేశం వీడి వెళ్లేందుకు వారం రోజుల గడువు విధించారు. పాక్ దౌత్యవేత్తకు సమన్లు ఉన్నారు. భారత్ ఆదేశాలతో ఏ రకమైన వీసాపై భారత్ లో ఉన్నప్పటికీ వారంతా పాకిస్తాన్ తిరిగి వెళ్లిపోవాల్సి ఉంటుంది.

## కూలీలు అనొద్దు..

## శ్రామికులని పిలుద్దాం



-మొదటిపేజీ తరువాయి

తీసుకున్న తర్వాత 2 నెలల పాటు సమగ్ర పరిశీలన చేసిన తర్వాత అధికారుల సమావేశంలో నేను చెప్పింది ఒక్కటే.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో ఏ పనికి ఏ నిధుల కేటాయింపు జరిగిందో అది పక్కాగా దానికే ఖర్చు చేయాలి. పారదర్శకంగా పనులు జరగాలి అని చెప్పాను. ఎలాంటి మళ్లింపులు, వృధా ఖర్చులు లేకుండా పల్లెల్లో సౌకర్యాలు, వసతులు సమకూరాలి అని చెప్పాను. దాని ప్రకారమే ఇప్పుడు పనులు జరుగుతున్నాయి. ఉపాధి హామీ పథకంలో పని చేసే వారిని కూలీలు అని పిలవడం కాస్త ఇబ్బందిగా ఉంది. గ్రామాల అభివృద్ధిలో చోదకులుగా పని చేస్తున్న వారిని అలా పిలవడం అంత బాగా లేదు. కూలీ అనే పదం బ్రిటీషు వారి భారతీయులతో వెట్టి చాకిరీ చేయించుకునేందుకు ఉపయోగించిన పదం. దాన్ని ఇప్పుడు మనం ఉపయోగించడం సమంజసం కాదు. కూలీ అంటేనే చాకిరీ చేసే వారుగా అనిపిస్తుంది. ఇక నుంచి ఉపాధి శ్రామికులు లేదా నేస్తాలుగా వారిని పిలుద్దాం. దీన్ని రాష్ట్రంలోని అధికారులకు తెలియజేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నాను. కూటమి ప్రభుత్వం 9 నెలల్లోనే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో రూ.10,669 కోట్ల పనులు జరిగాయి. 13,326 గ్రామసభల్లో తీసుకున్న నిర్ణయాలను చక్కగా అమలు చేశాం. 4 వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, 21,564 గోకులాలు, 12,950 నీటి తొట్టెలు, 20,286 ఫాం పాండ్స్ ను అతి తక్కువ కాలంలో పూర్తి చేయడం మనందరి సమష్టి కృషికి నిదర్శనం. దీంతోపాటు పంచాయతీరాజ్ వ్యవస్థను గిరిజన గ్రామాల్లోనూ విస్తరించడం ఓ గొప్ప ముందడుగు. అడవి తల్లి బాట కార్యక్రమంలో భాగంగా రూ.1,005 కోట్లతో 1069 కిలోమీటర్ల మేర రోడ్లను వేసి, డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ సాకారానికి ముందడుగు వేస్తున్నాం. గిరిజన గ్రామాల్లో సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేస్తున్నాం అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

### స్టాల్స్ పరిశీలన

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం వేడుకల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ఏర్పాటు చేసిన ప్రదర్శనను పవన్ కళ్యాణ్ తిలకించారు. ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్ కూటమి ప్రభుత్వ విజన్ ని ఆవిష్కరించే విధంగా ఆకట్టుకున్నాయి. పల్లెపండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చేపట్టిన సిమెంట్ రోడ్లు, గోశాలలు, నీటి తొట్టెలు, ఫాం పాండ్స్ తో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల నమూనాలతో ఏర్పాటు చేసిన స్టాల్ ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలచింది. గుంటూరు నగర పాలన సంస్థ పరిధిలో జిందాల్ సంస్థ నిర్వహిస్తున్న చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే యూనిట్ నమూనా పవన్ కళ్యాణ్ ని ఆకట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని యూనిట్లు ఉన్నాయి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీటితో పాటు కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత స్వతంత్ర్య దినోత్స వేడుకల నిర్వహణ ఖర్చులను పవన్ కళ్యాణ్ గారు రూ. 10 వేలు, రూ. 25 వేలకు పెంచిన తర్వాత పంచాయతీల్లో నిర్వహించిన స్వతంత్ర్య దినోత్సవ వేడుకల ఫోటోలతో చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రామాల్లో చెత్త నిర్వహణ, చెత్త నుంచి సంపదసృష్టి కేంద్రాల వివరాలు, వాటి పనితీరులను ప్రదర్శించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం నేతృత్వంలో గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, అభివృద్ధి పనుల వివరాలను ఆ విభాగం అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్ లో పవన్ కళ్యాణ్ గారికి వివరించారు. వీటితో పాటు గ్రామీణ నీటి సరఫరా విభాగం, అడవితల్లి బాట, వాటర్ మేనేజ్ మెంట్ స్కీమ్ నమూనాలను అధికారులు ప్రదర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, ఏపీఎస్ఆర్ డీపీర్ కమిషర్ ఆర్. ముత్యాలరాజు, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఎండీ అనిల్ కుమార్ రెడ్డి, అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, సత్యసాయి జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ వై.వి.కె. షణ్ముఖ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం సీఈ శ్రీ బాలు నాయక్, గ్రామీణ నీటిసరఫరా మరియు పారిశుధ్య విభాగం చీఫ్ ఇంజినీర్ గాయత్రిదేవి, సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో మరింత పెరగనున్న ఎండల తీవ్రత

**హైదరాబాద్:** తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2–3 డిగ్రీలు ఎక్కువగా ఉండే వీలుందని వెల్లడించింది. ఇవాళ, రేపు ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశముందని పేర్కొంది. చాలా జిల్లాల్లో రాత్రిపూట వేడి వాతావరణం మరింత ఎక్కువగా ఉండనుందని తెలిపింది. ఉత్తర, దక్షిణ ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

## పంచాయతీల్లో జాతీయ సమగ్రతా ప్రాంగణాలు, స్థూపాలు ఏర్పాటు



-మొదటిపేజీ తరువాయి

పవన్ కల్యాణ్ కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూదన్ రావు మృతదేహానికి నివాళులర్పించారు. నెల్లూరు జిల్లా కావలి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దని ప్రభుత్వం తరఫున అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మధుసూదన్ రావుకు నివాళులర్పించిన పవన్

### ఉగ్రదాడి ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది

ఇక, ఉగ్రవాద దాడి ఘటనపై పవన్ కళ్యాణ్ స్పందిస్తూ.. అమాయకపు ప్రజల పై ఉగ్రదాడి ఘటన నన్ను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఉగ్రదాడిలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను అని పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, జమ్మూకాశ్మీర్ లోని పహల్గామ్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడిలో అమాయకపు ప్రజలు బలయ్యారు. పహల్గం ఉగ్రదాడిలో ఏపీ వాసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మధుసూదన్ రావు మృతి చెందారు.

## ముమ్మాటికీ భద్రతా లోపమే

-మొదటిపేజీ తరువాయి

ఆర్మీ వాళ్లు లేనే లేరన్నారు. ప్రొటెక్షన్ కోసం ఉండే సెక్యూరిటీ కూడా లేదన్నారు. ఇంతమంది చనిపోయారు అంటే ప్రభుత్వ లోపమేనన్నారు. ఉగ్రవాదం కంట్రోల్ చేయాల్సిన బాధ్యత బీజేపీపై ఉందన్నారు. ఈ ఘటనకు అమిత్ షా, మోదీ బాధ్యత వహించి రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. ఇది ఇంటలిజెన్స్ ఫెయిల్యూర్ అని అన్నారు. నేడు దేశ నిఘా వ్యవస్థ దేశం కోసం పనిచేయడం లేదన్నారు. ఇండియా ఇంటలిజెన్స్ అంతా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న వాళ్ల మీద పనిచేస్తోందని ఆరోపించారు. ఇంత ఘోరంగా సెక్యూరిటీ విఫలం కావడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వీళ్లకు అధికారంలో ఉండే హక్కు లేదన్నారు. వీళ్ళు దేశానికి చౌకిదార్ కాదు..బీజేపీకి చౌకిదార్లని అన్నారు. ఈ దేశ దర్యాప్తు వ్యవస్థలను సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారన్నారు. నిఘా వ్యవస్థ బలం అంతా ప్రధాని మోదీ కోసం పని చేస్తోందన్నారు. దేశ భద్రతను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. ఇది ముమ్మాటికి కేంద్రం తప్పిదమేనని ఫైర్ అయ్యారు. ఈ ఘటనలో ఒక ముస్లిం కూడా చనిపోయారని.. దేశంలో ఉన్న ముస్లింలను చెడ్డవాళ్ళు అని చూపించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశంలో మతం పేరుతో యుద్ధం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ దేశంలోనే ఇంటర్నల్‌గా భద్రత లేదన్నారు. అన్ని మతాలు సమానం అనే పరిస్థితి లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తీవ్రవాదులకు అవకాశం ఇచ్చినట్లు అవుతుందన్నారు. మోదీ శ్రమ దేశ భద్రత కోసం పెట్టి ఉంటే బయట వాళ్ళు చొరబడే పరిస్థితి లేదన్నారు.

## థాంక్యూ.. జగన్ సార్

-మొదటిపేజీ తరువాయి

ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. పార్టీ కోసం నేను ఎంతో కష్టపడి పనిచేశాను. గొంతై మాట్లాడాను. ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డాను. ఎంతో కష్టపడి పనిచేసిన నన్ను అకారణంగా.. వ్యక్తి గత కారణాలు అనే కారణంతో నన్ను సస్పెండ్ చేశారని తెలిసింది. ఇందుకు నేను పార్టీ నాకు అందించిన సహకారం.. వైఎస్ రాజశేఖర్ రెడ్డితో అడుగులు వేసిన నేను.. జగన్మోహన్ రెడ్డితో నడుస్తున్న నేను.. నా హృదయంలో జగన్మోహన్ రెడ్డి ఎప్పటికీ చిరస్మరణీయం. భూకబ్జాలు చేయలేదు. పార్టీ కోసం మాత్రమే అహర్నిషలు పనిచేశాను. ఇక ఈ జరిగిన పరిణామాల్ని నేను స్వీకరిస్తున్నాను. ఇకనుంచి మరింత కష్టపడి పనిచేస్తాను. ఇంటింటికీ తిరుగుతాను. ప్రజలతో మమేకమైపోతాను. ఇంతవరకు గౌరవాన్ని అందించిన ప్రజలకు పాదాభివందనాలు. నా ఊపిరి ఉన్నంత వరకు ప్రజల సేవలో నిమగ్నమై ఉంటాను." అంటూ చెప్పుకొచ్చారు.

## ఏఐలోనూ మానవీయత ముఖ్యం

-మొదటిపేజీ తరువాయి

ఫిర్యాదులు, వినతుల్లో అధికంగా 75 శాతం భూసంబంధితమైనవే ఉన్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి త్వరితగతిన భూ రికార్డుల డిజిటలైజేషన్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కాగా.. 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్సఫర్మేషన్' అంశంపై సచివాలయంలో ఉన్నతాధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు వర్క్‌షాప్‌కు హాజరై, ప్రారంభోపన్యాసం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైన ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. గుడ్ గవర్నెన్స్ కోసం ఏఐ సహా నూతన టెక్నాలజీ వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై ప్రధానంగా చర్చించనున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పౌర సేవల్లో టెక్నాలజీ వాడకం, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, వచ్చే ఫలితాలపై కేస్ స్టడీస్ పరిశీలించనున్నారు. ఏయే విభాగాల్లో ఎటువంటి సాంకేతికను వినియోగించవచ్చు, ప్రస్తుతం ఉన్న సమాచారం ఆధారంగా సేవల్ని ఎలా విస్తృత పరచవచ్చు అనే దానిపై ప్రజంటేషన్ ఇచ్చారు. ఏఐ, ఎంఎల్, డీఎల్, చాట్ జీపీటీ, జెమిని, డేటా డ్రివెన్, ఎవిడెన్స్ బేస్డ్ గవర్నెన్స్, ఏఐ ప్లేబుక్, ఏఐ బేస్డ్ పైలెట్ ఐడియాస్ వంటి అంశాలపై ప్రత్యేక సెషన్స్ ఏర్పాటు చేశారు. వ్యవసాయం, విద్య, వైద్య, పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని పలువురు నిపుణులు వివరించనున్నారు. రెండు రోజుల పాటు కొనసాగనున్న వర్క్‌షాప్‌లో మొదటిరోజు కార్యదర్శులు, రెండోరోజు విభాగాధిపతులు హాజరుకానున్నారు. ఈ వర్క్‌షాప్‌కు సీఎస్, డీజీపీ, వివిధ శాఖల అధికారులు, కేంద్ర ఐటీ శాఖ మాజీ సెక్రటరీ చంద్రశేఖర్ ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. అలాగే వాద్వాని సెంటర్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ సీఈవో ప్రకాష్ కుమార్, డబ్ల్యుజీడీటీ డీన్ కమల్ దాస్‌తో సహా పలువురు నిపుణులు పాల్గొన్నారు.

## తిరుమలలో హై అలెర్ట్

-మొదటిపేజీ తరువాయి

ఇందులో భాగంగా ఏపీలోని తిరుమల తిరుపతి దేవస్థానం అలర్ట్ అయ్యింది. ఉగ్రవాదుల ముప్పు పొంచి ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని టీటీడీ యంత్రాంగం భద్రతను పెంచింది. అలిపిరి నుంచి ఆలయం వరకు భద్రతను కట్టుదిట్టం చేసింది. అలిపిరి తనిఖీ కేంద్రంతో పాటు ఘాట్ రోడ్డులోనూ చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసింది. పలుచోట్ల ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర ప్రైవేటు వాహనాలను తనిఖీ చేస్తోంది. ప్రయాణికుల లగేజీతో పాటు ప్రతి బ్యాగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు సెక్యూరిటీ సిబ్బంది. ఈ సందర్భంగా టిటిడి సీవీఎస్ఓ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ తిరుమలలోని అన్ని ప్రాంతాల్లో అదునాతన టెక్నాలజీతో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టామన్నారు. మరోవైపు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఆక్టోపస్ బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు చొరబడితే వారి నుంచి భక్తులను ఎలా కాపాడాలని మాక్ డ్రిల్ చేశారు. మాక్ డ్రిల్‌లో పోలీసు, విజిలెన్స్, ఆక్టోపస్ బలగాలు పాల్గొన్నాయి.

## సిరి ప్రసాద్ ట్రాక్ సాంగ్స్ బ్యానర్ ప్రారంభం



**విశాఖపట్నం: జయజయహే :**

సిరి ప్రసాద్ ట్రాక్ సాంగ్స్ బ్యానర్ ను జబర్దస్త్ ఆర్టిస్ట్ సత్తిపండు ప్రారంభించారు. జీ ఆర్ కే అధినేత గేదెల ఈశ్వరరావు ఆధ్వర్యంలో గాజువాకలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గాయనీ, గాయకులకు ఉపాధి అవకాశాలతో పాటు శిక్షణ ఇచ్చేందుకు ఈ బ్యానర్ బాగా ఉపయోగ పడుతుందని తెలిపారు. కళాకారులకు ప్రోత్సాహం అవసరమని, ఇటువంటి బ్యానర్లు ప్రారంభించడం ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత పాలకుర్తి సుబ్బారావు, జి ఆర్ కే మ్యూజిక్ అధినేత గేదెల ఈశ్వరరావు రచయిత ఈవిఆర్, నాని వెంకట్, జి అప్పలరాజు, రచయిత, లఘు చిత్ర దర్శకులు నాని నాయుడు, గాయనీ, గాయకులు ఎల్. బాలకృష్ణ, ప్రసాద్ సరోజ జానకి సుబ్బారావు, మనోహర్, గెద్దాల అప్పలరాజు మాధవ రెడ్డి, స్వామి రెడ్డి, గాయత్రి, లక్ష్మీ ప్రియా, ఉషారాణి పాల్గొన్నారు

## కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం.

- బస్సు ఢీకొనడంతో మహిళ మృతి

**కంచరపాలెం : జయజయహే :**



కంచరపాలెం ఊర్వశి జంక్షన్ దగ్గర గురువారం ఉదయం ఐదు గంటల యాక్టీవ్ మీద వెళ్తున్న ఫ్యామిలీని బస్సు ఢీ కొట్టింది. విజయవాడ నుంచి పార్వతీపురం వైపు వెళుతున్న ఇంద్ర ఆర్టీసీ బస్సు, తాటిచెట్ల పాలెం వైపు నుండి బర్మా క్యాంపు వైపు కట్టింగ్ అవుతున్న టూ వీలర్ బండిని గుద్దడంతో టూ వీలర్ వెనక కూర్చున్న ఎన్ మేరీ (62 )సంవత్సరాలు అక్కడికక్కడే చనిపోగా డ్రైవ్ చేస్తున్న కూతురు సుధారాణి ,40 సంవత్సరాలు ఆమెకు తీవ్ర గాయాలు తగలడంతో. చికిత్స నిమిత్తం ఎన్ ఆర్ ఐ హాస్పిటల్ కి తరలించారు..

## ప్రకృతి ఆధారంగా ప్రతి ఇంటా పంటలు పండించాలి

- మన ఆరోగ్యం మన చేతల్లోనే
- మా ఇంట్లో ప్రకృతి ఆధారంగా పంటలు పండిస్తున్నాం
- మిద్దె తోటలు పెంచండి పర్యావరణాన్ని పరిరక్షించండి
- బొలిశెట్టి సత్యన్నారాయణ, జాతీయ అధ్యక్షులు, జలబిరాద్రి.



**జయజయహే :**

ప్రకృతి ఆధారంగా ప్రతి ఇంటా పంటలు పండించాలి అని జలబిరాద్రి సంస్థ జాతీయ అధ్యక్షులు బొలిశెట్టి సత్యన్నారాయణ పిలుపునిచ్చారు. మురళీ నగర్ లోని మినియేచర్స్ ఎక్స్పర్ట్ రమాదేవి ఇంటి వద్ద ఉన్న మిద్దె తోట, ఆమె వ్యర్థాల నుంచి తయారు చేసిన అద్భుతమైన బొమ్మలు, చిన్న చిన్న కళాఖండాలు చూసి అబ్బుర పరిచే విధంగా ఉన్నాయి అన్నారు. మిద్దె మీద పూసిన కలువలు, కూరగాయలు ఆకుకూరలు పండ్లు అద్భుతంగా ఉన్నాయి అన్నారు. మన ఆరోగ్యం మన చేతల్లోనే ఉంది అన్నాను. తమ ఇంట్లో కూడా ప్రకృతి ఆధారంగా పంటలు చాలా కాలం గా పండిస్తున్నాం అని వివారించారు. మిద్దె తోటలు పెంచండి పర్యావరణాన్ని పరిరక్షించండి అని అక్కడకు వచ్చిన మహిళలు అందర్నీ ఆయన కోరారు. మిద్దె తోటల నగరంగా విశాఖపట్నాన్ని తీర్చి దిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన వనమాలి, సిటిజి సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వనమాలి, సిటిజి అడ్మిన్ లు మళ్ళ సరిత, అరవల అరుణ, నగరం లోని 14 ప్రాంతాలకు చెందిన ఏరియా ఇంచార్జీలూ పాల్గొని మాట్లాడారు.


## కె కె రాజుకు శుభాకాంక్షలు తెలిపిన కోడూరి సుశీల

**విశాఖపట్నం జయ జయహే :**



వై ఎస్ ఆర్ సి పి విశాఖ జిల్లా అధ్యక్షులుగా నూతనం గా నియమించబడిన ఉత్తర నియోజకవర్గం సమన్వయ కర్త మాజీ నెడ్కాప్ చైర్మన్ కె కె రాజును మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేసిన మాజీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోడూరి సుశీల

## విశాఖ జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షుడు కె కె కు శుభాకాంక్షలు తెలిపిన జోయ్



**విశాఖపట్నం జయ జయహే:**

విశాఖ జిల్లా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా ఎన్నిక అయిన కె. కె రాజు కు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన విశాఖ జిల్లా ఎస్ సి సెల్ జనరల్ సెక్రటరీ, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ,45,46,47 వార్డుల అధ్యక్షులు దొండపర్తి లక్ష్మణరావు (జోయ్ )

## ఉగ్ర దాడి అమానుషం - జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

- యాత్రికులను కాపాడుతూ ప్రాణాలను అర్పించిన నిజమైన హీరో సయ్యద్ అదిల్ హుస్సేన్ షా

**గుంటూరు : జయజయహే :**

పహల్గామ్ లో టూరిస్టులపై ఉగ్రమూకలు దాడి చేసి 26 మందిని అమానుషంగా కాల్చి చంపడాన్ని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తీవ్రంగా ఖండించారు. రాజకీయాలకు అతీతంగా దేశ సమగ్రతను కాపాడడానికి భారతీయులందరూ ఐక్యంగా ఉగ్రవాదం అంతమయ్యే వరకు ఉద్యమించాలన్నారు. జమ్ము కాశ్మీర్ లో అత్యధిక ఆదాయం టూరిజం ద్వారా వస్తుందని ,ఇలాంటి అమానుషమైన ఉగ్రదాడులతో టూరిజం పతనమవుతుందన్నారు. 2024 సంవత్సరంలో దాదాపు 20 లక్షల కు పైగా యాత్రికులు జమ్మూ కాశ్మీర్ ను సందర్శించడం జరిగిందని రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి టూరిజం ప్రధాన పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రపంచ దేశాలన్నీ ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ భారతదేశానికి మద్దతు పలకడం అభినందనీయమన్నారు. ఉగ్రవాదుల ఉగ్ర దాడి మానత్వానికే మచ్చగా మిగిల్చిందని తెలిపారు. సయ్యద్ అదిల్ హుస్సేన్ షా ఉగ్రవాదుల దాడి నుండి యాత్రికులను రక్షించడానికి తీవ్రంగా కృషి చేసి తన ప్రాణాలను అర్పించడాన్నీ భారతీయులు మరువ లేరన్నారు. టెర్రరిస్ట్ ల నుండి తుపాకీని లాక్కుని యాత్రికులను రక్షించడానికి చేసిన ప్రయత్నాన్ని భారత ప్రజలు మతాలకు అతీతంగా స్వాగతించాలన్నారు. 29 సంవత్సరాలు గల సయ్యద్ అదిల్ హుస్సేన్ షా యాత్రికులకు తన గుర్రం ద్వారా సహాయ సహకారాలు అందిస్తూ కుటుంబానికి జీవన ఆధారంగా ఉన్న సయ్యద్ అదిల్ హుస్సేన్ షాను నిజమైన హీరోగా భావించాలన్నారు. ముస్లింల సహాయంతోనే అనేక మంది రక్షించబడ్డారని ముస్లిం వ్యాపారస్తుల సహకారంతో తమ ప్రాణాలను కాపాడుకోగలిగామని యాత్రికులు తెలిపారన్నారు. ఉగ్రవాదుల దాడికి నిరసనగా ముస్లిం వ్యాపారస్తులందరూ స్వచ్ఛందంగా బంద్ పాటించారన్నారు .ఉగ్రవాదుల దుర్మార్గపు దాడులను మతాలకు అన్వయింప



చేయరాదని రాజకీయ పార్టీలకు జనచైతన్య వేదిక విజ్ఞప్తి చేస్తుంది. ఉగ్రవాదులపై చేసే దాడి ముస్లింలపై చేసే దాడిగా చిత్రీకరించవద్దని లక్ష్మణరెడ్డి కోరారు .భారతీయ లౌకిక తత్వాన్ని కాపాడటానికి ఐక్యంగా కృషి జరగాలన్నారు

## నేరేడు బంధలో జ్వరాలతో మగ్గుతున్న చిన్నారులు

- ప్రతి ఇంట్లో ఒక జ్వర పీడుతుడు
- వెంటనే ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి
- రికార్డుల్లో పేరు లేదని స్ప్రేయింగ్ చేయలేదు

**రావికమతం జయజయహే :**

అనకాపల్లి జిల్లా చోడవరం నియోజవర్గ పరిధిలో గల రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ కొండ శిఖర పివిటిజి కొందు గిరిజన గ్రామం నేరేడు బందులో చిన్నారులు జ్వరాలతో మగ్గుతున్నారు. ఈ గ్రామంలో 14 కుటుంబాలు వారు జీవనం సాగిస్తూన్నారు. ఇంచుమించుగా అన్ని ఇళ్లలోనూ జ్వర పీడుతులు ఉన్నారు. మూడు రోజుల నుండి జ్వరాలతో చిన్నారులు బాధపడుతున్నారనీ వెంటనే ఇక్కడ ప్రత్యేకంగా నిర్వహించాలని గ్రామస్తులతో పాటు సిపిఎం గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గురువారం ఆయా సంఘాల ప్రతినిధులు కే గోవిందరావు, పాంగి చంద్రయ్య, గేమిలి వాసు తదితరులు మాట్లాడుతూ, ఈ గ్రామానికి ఆశా కార్యకర్తలేరనీ, అంగన్వాడి సెంటర్ కూడా



లేదనీ, జోగంపేట స్కూల్ కి రాను పోను నడుచుకొని ఆరు కిలోమీటర్లు వెళ్లడంతో ఎండలో తో ఈ పిల్లలు అనేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ఇప్పటికే నర్సీపట్నం ఏరియా హాస్పిటల్ లో కిలో ప్రభాస్ అనే చిన్నారి వైద్యం పొందుతున్నారన్నారు. మిగిలివారు గ్రామంలోని జ్వరాలతో బాధపడుతున్నారన్నారు. వారిలో పాంగి అభిషేక్, కిల్లో సుందర్రావు, డిప్పల శివాజీ , కిల్లో కమల, సేదరి రత్నం, పాంగి సాయి, కిలో ప్రభాస్ ,గొల్లూరు భాస్కరరావు,పాంగి అంకిత, సేదరి రష్యా,సేదరి బంజి బాబు, డిప్పల విష్ణు ,పాంగి వసంత ఉన్నారన్నారు. ఈ గ్రామం రెవెన్యూ రికార్డులో లేకపోవడంతో మలేరియా స్ప్రింగ్ కూడా చేయకపోవడంతో



దోమలు తాకిడి ఎక్కువగా ఉందన్నారు. తక్షణమే జిల్లా అధికారులు ఈ గ్రామాన్ని సందర్శించి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాంగి చంద్రయ్య. పి వి టి జి సంఘం అధ్యక్షులు గేమిలి వాసు తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయకపోతే డోలీలతో పి. హెచ్.సి కేంద్ర వద్ద ఆందోళన నిర్వహిస్తామనీ హెచ్చరించారు. తక్షణమే జిల్లా కలెక్టర్ ఈ గ్రామాన్ని సందర్శించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## విజన్ 47 బృందంతో ఎంపీపీ సమావేశం

**మాడుగుల : విశాఖపట్నం :**

మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ రాజారం విజన్ 47 కమిటీ సభ్యులతో సమావేశం అయ్యారు. 2047కి భారతదేశానికి స్వతంత్రం వచ్చి 100ఏళ్ల పూర్తవుతున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలోనూ ప్రాథమిక సౌకర్యాలతో పాటు అన్ని రకాల సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా తగు కార్యచరణ రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిలో భాగంగా ప్రతి నియోజవర్గంలోను స్థానిక ఎమ్మెల్యే చైర్మన్ గా, హెడ్ క్వార్టర్ ఎండిఓ కన్వీనర్ గా నియోజవర్గంలో ప్రత్యేక అధికారితో పాటు, మిగిలిన ఎండివోలు తాసిల్దార్లు సభ్యులుగా కమిటీలో నియమించింది. వీరితోపాటు నియోజకవర్గంలో సమస్యలపై సర్వే చేసేందుకు ప్రత్యేక అధికార బృందానికి కూడా నియమించింది. దీనిలో భాగంగా మాడుగుల నియోజవర్గానికి ఐదుగురు ఉద్యోగులను ఒక ఏడాది పాటు డిప్యూటేషన్ పై నియమించింది. వారితో ఎంపీపీ సమావేశమై విజన్ 47 తీరుతెన్నులు ఏ అంశాల సర్వే జరుపుతారు, ఎక్కడ సర్వే జరుపుతారు, ఎన్నాళ్లు చేస్తారు వంటి వివిధ అంశాలు పై చర్చించారు. ఈ సందర్భంగా సిబ్బంది భాస్కర్, రాము, అప్పలరాజు, రాధాకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ.. ఉదాహరణకు వ్యవసాయంపై సర్వే జరిగినప్పుడు ఆ నియోజకవర్గంలో వ్యవసాయ ఆధారిత వనరులపై సర్వే నిర్వహిస్తారు. వ్యవసాయానికి కావలసిన నీరు ఇతర అవసరాల కోసం పరిశీలన జరుపుతారు. సాగునీటి కోసం జలాశయాలు నిర్మాణంలో నిలిచిపోతే బట్ పరిస్థితి తీసుకోవాల్సిన చర్యలు గురించి నివేదిక అందిస్తారు. ఆ విధంగానే అన్ని అంశాలపై కూడా క్షుణ్ణంగా చర్చ జరూపుతారన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలు, చేపట్టవలసిన కార్యక్రమాలు, విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు, ఉద్యోగ అవకాశాలు,



మానవ స్థితిగతులు, నిరుద్యోగ సమస్య భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు వంటి వాటి గురించి సర్వే నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి అంశాన్ని క్షుణంగా పరిశీలించి మాడుగుల నియోజకవర్గం విజన్ 47 నాటికి సమస్యలు లేని ప్రాంతంగా తయారు అయ్యే విధంగా కృషి చేయాలి అన్నారు. ఈ సమావేశంలో కో ఆప్షన్ నెంబర్ ఉన్నిషా, మురళి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి వినియోగంతో సమాజానికి చేటు - జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్

**పాడేరు: జయజయహే :**

గంజాయి వినియోగంతో సమాజానికి చేటని గంజాయి నిర్మూలన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. జిల్లాలో గంజాయి తగ్గుముఖం పట్టిందన్నారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో గంజాయి సాగు నిర్మూలన పై ఈగల్, పోలీస్, వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, ఉద్యానవన శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, ఐసిడిఎస్, డ్వామా, డి. ఆర్. డి. ఏ అధికారులతో గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి నిర్మూలన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలలో గంజాయి వినియోగంపై కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. కళాశాలల్లో అవగాహనా సదస్సులు, డి ఎడిక్షన్ సెంటరుకు ఎంత మంది వచ్చారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గంజాయి సాగు చేసే రైతులు, సరఫరా దారులు పై ప్రత్యేక దృష్టి పెట్టి అటువంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. గంజాయి విడిచి పెట్టిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, స్వయం ఉపాధి పథకాలు, బ్యాంకు రుణాలు, పశువులు, మేకలను మంజూరు చేయాలని స్పష్టం చేసారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన



ఫిర్యాదుల పెట్టెలలో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయని ఆరా తీసారు. గంజాయి నిర్మాలనపై గ్రామ స్థాయిలో బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. 15 వేల ఎకరాలల్లో నీడ తోటలు, పండ్ల తోటలు పెంపకానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పది ఫెయిలైన విద్యార్థులతో సప్లమెంటరీ పరీక్షలకు ఫీజులు కట్టించాలని సూచించారు. వారపు సంతల్లో గంజాయిపై అవగాహనా శిబిరాలు నిర్వహించాలని చెప్పారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా వారి స్థిర, చరాస్తులను జప్తు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. గంజాయి స్మగ్లర్లకు గిరిజన గ్రామాల్లో ఆశ్రయం కల్పించడం నేరమని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 221 గ్రామాల్లో గంజాయి సాగు నిర్మూలనపై అవగాహనా సదస్సులు నిర్వహిం



చామన్నారు. పక్క మార్చి నెలలో 9 మందిపై కేసులు నమోదు చేసి 782 కేజీల గంజాయిని పట్టు కున్నామన్నారు. బస్టాండ్లలో పటిష్టమైన నిఘా పెట్టామని చెప్పారు. జాతీయ విద్యా విధానాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. అనంతరం గంజాయి నిర్మూలనపై రూపొందించి గోడ పత్రికలను అధికారులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ (వర్చువల్) జిల్లా వ్యవసాయాధికారి ఎస్. బి. ఎస్. నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు, జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు, గృహ నిర్మాణ శాఖ ఇ ఇ బి. బాబు, డి ఎస్ ఓ, వెంకటరావు, ఈగల్ ఇన్సెపెక్టర్ ఎస్.రమేష్, వివిద శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ మేయర్ అవిశ్వాస తీర్మానంపై జరిగిన ముఖ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు

- కార్యక్రమంలో పాల్గొన్న అర్బన్, రూరల్ అధ్యక్షులు

**పెందుర్తి : జయజయహే :**

జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, సౌత్ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ , అర్బన్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి ఎమ్మెల్యే రమేష్ బాబు ఆదేశాల మేరకు జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ వసంత లక్ష్మి ఆధ్వర్యంలో టీవిఎంసి కార్పొరేటర్లతో సీతంపేట పార్టీ కార్యాలయంలో ముఖ్య సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఈ నెల 26వ తారీఖున జరిగే డిప్యూటీ మేయర్ ఎన్నిక సంబంధించి పలు అంశాలపై ప్రస్తావించారు. డిప్యూటీ మేయర్ అవిశ్వాస తీర్మానంపై చర్చించారు. ఈ అవిశ్వాస తీర్మానంలో జనసేన పార్టీ 14 మంది కార్పొరేటర్ లు, ఎమ్మెల్యేలు తప్పనిసరిగా పాల్గొనవలెనను సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కార్పొరేటర్లు గోవింద్ రెడ్డి , మూర్తి యాదవ్ , మేరీ జోన్స్ ,సాదిక్ , కందుల నాగరాజు , ఉషశ్రీ ,కామేశ్వరి ,సూర్య కుమారీ , వంశీ రెడ్డి , బెహరా భాస్కర్ , ఆళ్లలీలావతితో పాటు యలమంచిలి ఎమ్మెల్యే పెద్దలు విజయ కుమార్ పాల్గొన్నారు.



# జీవన ఎరువులు - వ్యవసాయానికి జీవ నాడులు

భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలకమైన పాత్ర పోషిస్తుంది. కానీ గత కొన్ని దశాబ్దాలుగా హరిత విప్లవం తరువాత హైబ్రిడ్ వంగడాల రాకతో అధిక దిగుబడుల ఆశతో రైతులు పరిమితికి మించి రసాయన ఎరువులను వాడడం మొదలు పెట్టారు ఆధారపడటం మొదలుపెట్టారు. దీని వల్ల తాత్కాలికంగా దిగుబడుల పెరిగినా నేల సారవంతత సహజ ఉత్పాదకత తగ్గిపోయింది. మట్టిలో జీవకణాలు తగ్గుతూ అవి జరిపే రసాయన చర్యలపై గణనీయంగా మార్పులు వచ్చాయి తద్వారా భూమి సజీవ శక్తిని కోల్పోతూ వస్తుంది మళ్ళీ దీనిని పునరుద్ధరించాలంటే రసాయన వ్యవసాయం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలి సేంద్రియ వ్యవసాయంలో జీవన ఎరువుల పాత్ర చాలా ప్రముఖమైనది..

జీవ ఎరువులు అంటే ఏమిటి?

జీవ ఎరువులు అనేవి సూక్ష్మజీవుల ఆధారంగా తయార వుతాయి. ఇవి మట్టిలో జీవకణాల వృద్ధికి దోహదపడతాయి. మొక్కలకు అవసరమైన పోషకాల్ని సహజంగా అందిస్తాయి. రసాయనాల వాడకాన్ని తగ్గిస్తాయి. ఇవి ముఖ్యంగా బ్యాక్టీరియా, ఫంగస్, ఆల్గే వంటి జీవులతో తయారవుతాయి.

జీవ ఎరువుల రకాలు – వాటి ప్రత్యేకతలు నత్రజని స్థిరీకరణ సూక్ష్మజీవులు: అజోస్పిరిల్లం, అజటోబాక్టర్, రైజోబియం వంటివి వాతావరణంలోని నత్రజనిని మట్టిలోకి మలచి మొక్కలకు అందిస్తాయి. ఫాస్ఫరస్ మొబిలైజింగ్ సూక్ష్మజీవులు: ఫాస్ఫోబాక్టీరియా, బ్యసిల్లస్ మెగాటీరియమ్ వంటివి అందుబాటులో లేని ఫాస్ఫరస్‌ను మొక్కలు గ్రహించ గలిగే రూపంలోకి మార్చుతాయి. పొటాష్ మొబిలైజింగ్ బ్యాక్టీరియా: మట్టిలో ఉన్న పొటాష్‌ను మొక్కలు గ్రహించేందుకు సహాయపడతాయి. మైకోరైజా: మొక్కల వేర్లతో సహజీవనం చేస్తూ, పోషకాలను గ్రహించే సామర్థ్యాన్ని పెంచుతుంది. వేర్ల చుట్టూ రక్షణ పొరను ఏర్పరచి, మట్టి ద్వారా వచ్చే వ్యాధులను అడ్డుకుంటుంది. మిశ్రమ జీవ ఎరువులు (బయో): విభిన్న సూక్ష్మజీవాలను కలిపి తయారుచేసే మిశ్రమం ఇవి మల్టీ ఫంక్షనల్‌గా పనిచేస్తాయి. విత్తన శుద్ధిలో, వేరు ముంచడంలో, నీటితో కలిపి డ్రిప్ ద్వారా ఈ జీవ ఎరువులను వాడవచ్చు.

ఇతర ముఖ్యమైన జీవ ఉత్పత్తులు:

జీవ శిలీంద్ర నాశకాలు: ట్రైకోడెర్మా విరిడీ, సుడోమోనాస్ ఫ్లోరోసెన్స్ – శిలీంద్ర వ్యాధులను అరికడతాయి. జీవ బ్యాక్టీరియా నాశకాలు: బాసిల్లస్, స్ట్రెప్టోమైసీస్ – బ్యాక్టీరియాల వల్ల వచ్చే వ్యాధులపై ప్రభావవంతంగా పనిచేస్తాయి. జీవ పురుగుమందులు: బవేరియా, మెటారిజం, వెర్టిసెలియం, వేప ఆధారిత ఉత్పత్తులు, (న్యూక్లియర్ పాలీహైడ్రోసిస్ వైరస్ ను నియంత్రించేందుకు సహజ మార్గాలు. జీవ సూది పురుగు నియంత్రకాలు (బయో నెమటోసైడ్స్) పాసిలోమైసిస్ – వేర్లపై దాడి చేసే సూదిపురుగుల నివారణకు. జీవ కలుపు మందులు (బయో హెర్బిసైడ్స్) కొలటుట్రైకం – కలుపు మొక్కల నియంత్రణకు (ఇప్పటికీ పరిశోధన దశలో ఉంది). మొక్కల వృద్ధికి సహాయ పడే జీవులు : అజోస్పైరిల్లం, బాసిల్లస్ – వేరు అభివృద్ధికి, వృద్ధికి సహకరిస్తాయి. జీవ వృద్ధి ప్రేరకాలు (బయో స్టిములెంట్స) సముద్రపు నాచు, హ్యూమిక్ యాసిడ్ – పూత, ఫలాల పరిపక్వతను వేగవంతం చేస్తాయి. జీవ వికర్షకాలు(బయో రెప్పలెంట్స్ ) నీమ్ ఆయిల్, వెల్లులి మిశ్రమం – పురుగులను దూరంగా ఉంచుతాయి. జీవ ఉత్పత్తుల ప్రయోజనాలు: మట్టికి జీవం పోస్తాయి: జీవకణాల పెరుగుదల ద్వారా మట్టిని సారవంతంగా మార్చుతాయి. మొక్కలకు పోషకాల లభ్యత పెరుగుతుంది: నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి మూలికలను మొక్కలు బాగా గ్రహిస్తాయి. వేర్ల అభివృద్ధి మెరుగవుతుంది: వేర్ల పొడవు, వ్యాప్తి పెరిగి మొక్కల స్థిరత్వం పెరుగుతుంది.


వ్యవసాయ వ్యయం తగ్గుతుంది: రసాయన ఎరువుల ఖర్చు తగ్గి, రైతుకు ఆదాయం పెరుగుతుంది. పర్యావరణ హితం: మట్టి, నీరు, గాలిని కలుషితం చేయవు. ప్రకృతిని కాపాడతాయి. సేంద్రియ వ్యవసాయానికి మౌలికం: జీవ



రువుల్లేకుండా సేంద్రియ వ్యవసాయం సాధ్యం కాదు. జీవ ఎరువులు రైతు భవిష్యత్తుకు వెలకట్టలేని పెట్టుబడి. ఇవి భూమికి జీవం, పంటలకు పోషణ, రైతుకు లాభం, సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారం అందించే మార్గం. రైతులు ప్రకృతితో సమన్వయంగా సాగు చేయాలంటే, జీవ ఉత్పత్తులు మార్గదర్శకంగా నిలుస్తాయి. సారవంతమైన భూమి – సమృద్ధిగా పంట – ఆరోగ్యకర సమాజం” అనే లక్ష్యంతో ప్రతి రైతు జీవ ఉత్పత్తులను పంటలకు వాడాలి. జీవన ఎరువులే రైతుల జీవితాలలో వెలుగులు నింపే వనరులు మట్టిలో జీవం వుంటేనే మనిషికి జీవితం వుంటుంది.

జి. అజయ్ కుమార్
వ్యవసాయ నిపుణులు

# భారతీయ సంస్కృతికి అరుదైన గౌరవం




ప్రపంచ వ్యాప్త విస్తృతి పొందిన సనాతన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు యునెస్కో గుర్తింపు లభించింది. భారత దేశ వారసత్వ ప్రతీకగా భావించే భగవద్గీత, భరతముని రచించిన నాట్యశాస్త్రానికి అరుదైన గౌరవం సంప్రాప్తించింది. ప్రాచీన వారసత్వ సంపదలను భద్రపరిచే ఐక్యరాజ్యసమితి విద్యా శాస్త్రీయ సాంస్కృతిక సంస్థ (యునెస్కో) మెమోరీ ఆఫ్ ది వరల్డ్ రిజిస్టర్‌లో వీటికి తాజాగా చోటు దక్కింది. ప్రపంచ వారసత్వ దినోత్సవ సందర్భంగా ఈ విషయాలను యునెస్కో సంస్థ వెల్లడించింది.

భగవద్గీత, నాట్యశాస్త్ర లిఖిత ప్రతులతో పాటు వివిధ దేశాలకు చెందిన 74 వారసత్వ డాక్యుమెంటరీలను గుర్తించింది. దీంతో ఇంతవరకు మొత్తం సేకరణల సంఖ్య 570కి చేరింది. ‘భారతీయ జ్ఞానసంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోంది. ఈ రచనలు మన దేశంపై ప్రపంచ మానవ దృక్పథానికి, జీవన విధానానికి పునాదులుగా భాసిల్లుతున్నాయి. మన దేశం నుంచి 14 గ్రంథాలు యునెస్కో రిజిస్టర్‌లో చోటు చేసుకోవడం విశేషం. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన గుర్తింపుగా ప్రధాని నరేంద్ర మోడీ తన సందేశంలో పేర్కొన్నారు. శతాబ్దాలుగా మానవ ఔన్నత్యానికి దోహదపడిన ఈ రెండు ఉద్గ్రంథాలను నిక్షిప్తం చేయడమంటే కాలాతీత విజ్ఞానాన్ని సైతం పుణికిపుచ్చుకునే ప్రక్రియగానే స్వీకరించాలి.


భారతీయ జ్ఞానసంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోందనడానికి నిదర్శనం నేటి గుర్తింపే. భారతీయ జీవన విధానానికి పునాదులుగా భాసిల్లుతున్న ఈ రెండు గ్రంథాల సారాంశాలు సర్వజనావళికి ఆచరణీయాలేనన్న విషయాన్ని ప్రపంచమూ గుర్తించింది. ఇప్పటివరకు మన దేశంనుంచి 14 శాసనాలు. యునెస్కో రిజిస్టర్‌లో చోటు దక్కించుకున్నాయి.ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. గీతా సారాన్ని, నాట్య శాస్త్రాన్ని యునెస్కో రిజిస్టర్‌లో చేర్చడం మన జ్ఞాన సంపద, సంస్కృతికి లభించిన ఘనమైన గుర్తింపు. ఇవి వేల శతాబ్దాలుగా మన నాగరికత ఔన్నత్యాన్ని వివరించి, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాయి.ప్రపంచానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. యుద్ధరంగంలో సోదరులు, గురువులు, బంధుజనులందరినీ చూసి ధనుర్బాణాలు విడిచి చతికిల పడిపోయిన అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన బోధ భగవద్గీత. ఇందులో 18 అధ్యాయాలు ఉన్నాయి. ప్రతి బోధ మానవ వర్తన, వికాసానికి మెచ్చుతునక. మనుషులు ప్రవర్తించవలసిన తీరు, పారలౌకికాన్ని పొందే విధానం రెండింటినీ శ్రీకృష్ణుడు బోధించాడు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన క్షణంగా అభివర్ణించవచ్చు. భారత దేశమంటేనే వివిధ భాష, సంస్కృతుల సమ్మేళనం.

రామాయణ, మహాభారత ఇతిహాసాలు, ఉపనిషత్తుల నుండి సముపార్జించిన విజ్ఞాన సంపదతో విలసిల్లేదే మన పుణ్యభూమి. భగవద్గీతను కేవలం ఒక మతగ్రంథంగా ఎవరూ చూడరు.అదొక కర్తవ్య బోధమాత్రమే. భరత నాట్యకళ అంటేనే ప్రపంచమంతా మెచ్చే శాస్త్రం.

వీటిని ప్రపంచ వారసత్వ సంప్రదాయాలుగా యునెస్కో గుర్తించడమంటేనే భారతీయ విలువలకు, తత్వబోధకు, కళాకౌశల శాస్త్రానికి ఇచ్చిన సమున్నత గౌరవంగా భావించవచ్చు. భగవద్గీత లాంటి నిజజీవన సత్యాలు, తత్వాల చిత్రీకరణ, ధర్మబద్ధ జీవితం గురించి సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడే ప్రవచించిన అంశాలు నిజంగా నిత్యజీవన అంశాలే. వాటి విశ్లేషణ ప్రతి ఒక్కరికీ అనుభవైక వేద్యాలే! ప్రపంచ దేశాలకు భారతీయతను పరిచయం చేసే ప్రక్రియ ఈనాడే మొదలు కాలేదు. కేవలం అర్జునుడి సందేహాలకు, సందిగ్ధానికి ఓ మేలుకొలుపుగా ఉండేవి. గీత పుట్టిన నాడే సర్వోన్నత స్థాయిలో ప్రపంచానికి తత్వశాస్త్రంగా ప్రజల్లోకి వెళ్ళిపోయింది. మానవునిలో ఉన్న భ్రమలను తొలగించే నీతినియమాల పాఠ్యాంశంగా ప్రాచుర్యం పొందింది. అందుకే భగవద్గీత ఎన్నో ప్రపంచ విశ్వవిద్యాలయాల్లో అధ్యయన శాస్త్రంగా భాసిల్లుతోంది. ఈ గుర్తింపు ఏనాడో రావాల్సి ఉంది. అయినా ఇప్పటికీ ఆలస్యం కానట్లే. మన నాగరికతను, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించిందనే కాదు, ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా ఉన్నందునే ఇలాంటి గుర్తింపు సబబే! అణువణువునా ఆత్మస్థైర్యం సన్నగిల్లి నరనరానా నిరాశా, నిస్పృహలు ఆవహించిన వారికి గీతా పఠనం చైతన్యం నింపుతుంది.

అంతరాంతరాల్లో ఉన్న ఆసక్తులు, అనురక్తులు పొంగి పొర్లినప్పుడు నృత్యం జీవననాదమవుతుంది. గీతాసారం నిత్యజీవన సారమైతే, భరత నాట్యం భారతీయ కళల్లో ఉత్కృష్టమైంది. అంగికం, అభినయం నుంచి కళా సమ్మిళత నాట్యంగా ఎన్నో దేశాల భామలు నాట్యాభినయంలో మునిగితేలుతున్నారు. వీటి గురించి దేశవిదేశాల్లో తెలియని దేశమంటూ లేదు. సర్వకళాసారం వీటిలోనే ఉంటుందని దేశం ఏనాడో గుర్తించింది. విభిన్న సంస్కృతుల మేళవింపు కలిగిన సందర్భంలో పరిస్థితుల్లో నాట్యకళ కాని, గీతాపఠనం కాని చెక్కుచెదరకుండా ఆదరిస్తుండడం వాటి ఖ్యాతిని గురించి చెప్పుకోవడం విశేషమే. అందుకే అవి ఈనాటి విశ్వకళా రాజసాలుగా వినుతికెక్కాయి. దైనందిన జీవితానికి మార్గదర్శకంగా ధర్మాచరణ ప్రాశస్త్యమున్న అంశాలను భగవద్గీత మాత్రమే చూపుతుంది. భగవద్గీత, భరత నాట్య విశేషాలను మరింత విస్తృత స్థాయిలో భవిష్యత్‌లకు తెలియచేసేందుకు ప్రభుత్వాలు పూనుకోవాలి. వాటి వైశిష్టతలను భరతజాతికి పునరంకితం చేసే బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవడం అవసరం.

## పన్ను రాయితీలతో ఆర్థికాభ్యుదయమా?




పాత పార్లమెంట్ భవనంలోని రీడింగ్ రూమ్ పై భాగంలో వివిధ సంస్థానాధీశుల రాచరిక చిహ్నాలు కనపడతాయి. స్వాతంత్ర్యం రాకముందు ఈ రీడింగ్ రూమ్ సంస్థానాధీశుల ఛాంబర్‌గా ఉండేది. రాజులు పోయారు, రాచరిక చిహ్నాలు పోయాయి. స్వాతంత్ర్యం తర్వాత సామాన్యులు పార్లమెంట్‌లో ప్రవేశించడం ప్రారంభమైంది. పుచ్చలపల్లి సుందరయ్య లాంటి నేతలు సైకిల్‌పై కూడా పార్లమెంట్‌కు వచ్చేవారు. మరి ప్రస్తుత పరిస్థితులు ఎలా ఉన్నాయి? సంస్థానాధీశులకు బదులు ఇప్పుడు కోట్లకు పడగెత్తినవారు పార్లమెంట్‌లో ప్రవేశిస్తున్నారు. తెలుగుదేశం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు సైకిల్‌పై పార్లమెంట్‌కు వస్తే అది ఒక అరుదైన దృశ్యంలా కనిపిస్తోంది. అసలు సంపన్నులు కాని వారు పార్లమెంట్ సభ్యులు కావడం అరుదుగా మారింది. 18వ లోక్‌సభలో 93 శాతం మంది ఎంపీలు కోటీశ్వరులైతే, కోటీశ్వరులు కానివారు పార్లమెంట్‌కు రావడం అసాధ్యమని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ తెలిపింది. రూ.10 కోట్లకు పైగా ఆస్తులు సంపాదించిన ఎంపీలు 42 శాతం మంది ఉన్నారు. లోక్‌సభ పరిస్థితి ఈ విధంగా ఉంటే, రాజ్యసభలో సంపన్నులు కానివారు ప్రవేశించడం అతి కష్టంగా మారింది. మొత్తం రాజ్యసభ సభ్యుల ఆస్తుల సగటు విలువ రూ.87 కోట్లు దాటితే బీజేపీకి చెందిన 90 మంది రాజ్యసభ ఎంపీల ఆస్తుల విలువ రూ.37 కోట్లకు పైగా ఉంటుంది. పట్టణాల్లో నివసించేవారి సగటు ఆస్తుల విలువ కంటే ఎంపీల ఆస్తులు 27 రెట్లు ఎక్కువ ఉంటుందని ఒక అధ్యయనం పేర్కొంది.

భారతదేశంలో సంపన్నులూ–మధ్యతరగతికీ మధ్య సంపద విషయంలో వ్యత్యాసం చట్టసభల్లోనే స్పష్టంగా కనబడుతుంది. ఒకప్పుడు కేవలం రూ. 10 కోట్లతోనే దేశం మొత్తం ఎన్నికలు జరిగేవి. ఇప్పుడు వేల కోట్లు ఎన్నికల్లో ప్రవహిస్తున్నాయి. సంపన్నులకు అన్ని రకాల రాయితీలు, లక్షల కోట్ల రుణాలు, ప్యాకేజీలు, నల్లధనం పెంచుకునేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. వారు ఎన్నికలను ప్రభావితం చేసేందుకు, చట్ట సభల్లో ప్రవేశించేందుకు దోహదం చేస్తుంటే, సామాన్యులను శాంతింపచేసేందుకు రేషన్‌తో పాటు రకరకాల ఉచితాలు, పథకాలు, మహిళా సమ్మాన్ యోజన వంటి తాయిలాలు ప్రకటిస్తున్నారు. ఇదీ మన దేశ రాజకీయాల్లో పరిఢవిల్లుతున్న ప్రజాస్వామ్యం! కేవలం సైద్ధాంతిక నిర్ణయాల ద్వారా భావోద్వేగాలను రేకెత్తించి మధ్యతరగతిని ఆకట్టుకోవడం సాధ్యపడదని బీజేపీ గ్రహించినట్లు కనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ చట్టం, రామమందిర నిర్మాణం వంటివి ఎన్ని జరిగినా 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి అంతగా ప్రయోజనం కలగలేదు. ఏమీ ఖర్చుపెట్టకుండానే, రకరకాల పన్నుల ద్వారా వారి జేబులకు కత్తెర వేస్తూ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ, నిత్యావసర వస్తువులు ఆకాశానికి పెరిగిపోయినా విస్మరిస్తూ ఉంటే మధ్యతరగతి ఎంతకాలం మౌనం పాటిస్తారు? మెజారిటీ జీఎస్టీ వసూళ్లు మధ్యతరగతి నుంచే లభిస్తున్నాయని ఒక అంచనా. స్కూలు ఫీజుల్లో కూడా జీఎస్టీ వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. కార్పొరేట్లు చెల్లించే పన్నులకంటే వ్యక్తిగత పన్నుల వసూళ్లు దాదాపు రూ. 2లక్షల కోట్లు ఎక్కువ. వ్యక్తిగత పన్నుల వసూళ్లు 19 శాతం పెరిగితే కార్పొరేట్ పన్ను వసూళ్లు 7 శాతమే పెరిగాయి. ఇందుకు కారణం ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలే. ఉదాహరణకు 2019 సెప్టెంబర్‌లో కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారు. బ్యాంకులకు లక్షల కోట్లు ఎగ్గొట్టిన సంపన్నులను ఏమీ చేయడం లేదనే ఒక అభిప్రాయం నెలకొని ఉన్నది. కార్పొరేట్లు తాము ఆర్జించిన మొత్తాన్ని పెట్టుబడులు పెడతారని, ఉద్యోగాలు కల్పిస్తారని ప్రభుత్వం ఆశించింది కాని అది జరగలేదు సరికదా. వారు తమ ఖజానాలు నింపుకున్నారు. గత దశాబ్దంలో తీవ్రమైన ద్రవ్యోల్బణం రీత్యా మధ్యతరగతి తమ ఆదాయాలు పెరగకపోవడాన్ని గమనించారు. వచ్చిన డబ్బులన్నీ మళ్లీ ఏదో రూపేణా లాగేసుకుంటున్నట్లు వారు గమనించారు.

బహుశా అన్ని విధాల నష్టపోతున్నది మధ్యతరగతి వారేనన్న అభిప్రాయం గత కొద్ది సంవత్సరాలుగా నెలకొని ఉన్నది. ఆ మధ్యతరగతిని శాంతింపచేయడం కోసమే రెండు రోజుల క్రితం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు స్పష్టమవుతోంది. పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశంలోని మధ్యతరగతి ఆకాంక్షలను నెరవేర్చినప్పుడే ఆర్థిక ప్రగతి సుసాధ్యమవుతుందని ప్రకటించారు. ‘ఈ దేశ మధ్యతరగతి ప్రజలు, పేదలకు లక్ష్మీదేవి ఆశీర్వాదం లభిస్తుందని ఆశిస్తున్నాను..’ అని బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజే మోదీ మీడియాతో అన్నారు.

బీజేపీ పట్ల మధ్యతరగతిలో ఒక రకమైన ఉదాసీనత పెరుగుతూ వస్తోంది. ఈ విషయం గ్రహించినందువల్లే బీజేపీ తన మార్గాన్ని మార్చుకుంది. ఒకప్పుడు ఉచితాలను వ్యతిరేకించిన మోదీ రాష్ట్రాల ఎన్నికల్లో ఉచితాలను ప్రకటించడానికి అనుమతించారు. ఇప్పుడు మధ్యతరగతిని కూడా ఆకట్టుకోవడం తప్పనిసరి అని బీజేపీ గ్రహించింది. ఢిల్లీ ఎన్నికలను మాత్రమే కాదు, రాబోయే ఎన్నికలను కూడా దృష్టిలో ఉంచుకుని దేశ వ్యాప్తంగా తన ఆర్థిక విధానాలపై అభిప్రాయాన్ని మార్చేందుకు మోదీ ప్రయత్నాలు ప్రారంభించినట్లు స్పష్టమవుతోంది. ‘నేను కూడా మనిషిని. తప్పులు చేయడం సహజం. నేనేమీ దేవుడిని కాదు..’ అని జనవరి మొదటి వారంలో ఒక పాడ్‌కాస్ట్‌లో నరేంద్రమోదీ అనడంలో అంతరార్థం ఆయన తదుపరి చర్యల్లో కనపడుతోంది. గత పదేళ్లుగా లేని ఆదాయపన్ను మినహాయింపులను ప్రకటించడం ఇందుకు నిదర్శనం. మొత్తానికి మోదీ, ఆయన బృందం తమ తప్పులు సరిదిద్దుకోవడానికి పెద్దగా సమయం తీసుకోరని, రాజకీయంగా పట్టుకోల్పోకుండా చూడడమే వారి ప్రధాన లక్ష్యమని స్పష్టంగా అర్థమవుతుంది. అందుకే గిగ్ వర్కర్లతో సహా తమ ఓటు బ్యాంకుతో ముడివడి ఉన్న పలు వర్గాలను సంతృప్తిపరిచేందుకు త్వరితంగా చర్యలు చేపట్టేందుకు ప్రయత్నించింది. ఒక్క బీమా రంగంలో వంద శాతం పెట్టుబడులను అనుమతించడం తప్ప ఏ రంగంలోనూ విధానపరమైన మార్పులు చేయలేదు. అభివృద్ధి పగ్గాలను ప్రైవేట్ రంగానికి అప్పగించాలని ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు తయారు చేసిన ఆర్థిక సర్వే చెప్పినప్పటికీ ప్రభుత్వం బడ్జెట్‌లో మాత్రం ఆచితూచి చర్యలు తీసుకుంది. ఈ సారి పన్ను చెల్లించేవారికి రాయితీలు కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టంగా చెప్పారని ఫైనాన్స్ సెక్రటరీ తెలిపారు.

భారతదేశంలో మధ్యతరగతి జనాభా రోజురోజుకూ పెరుగుతుందని ఒక అంచనా. జనాభాలో 31 శాతం మధ్యతరగతి వారే కాగా వారి సంఖ్య 2031 నాటికి 38 శాతం, 2047 నాటికి 70శాతానికి చేరుకుంటుందని, దాదాపు వందకోట్ల మేరకు మధ్యతరగతి ప్రజలే ఉంటారని పీపుల్ రీసర్చ్ ఆన్ ఇండియన్ ఎకానమీ (ప్రైస్) వంటి సంస్థలు చెబుతున్నాయి. అందుకే పాశ్చాత్య బహుళ జాతి సంస్థల యజమానులు ప్రధానంగా ఎఫ్‌ఎంసిజి రంగానికి చెందిన వారి దృష్టి భారతదేశంపై పడుతోంది. 2019 ఎన్నికలతో పోలిస్తే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నష్టపోవడానికి కారణం మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ఓటర్లు బీజేపీకి దూరం కావడమేనని లోక్‌నీతి%-% సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సిఎస్‌డిఎస్) ఎన్నికల అనంతరం నిర్వహించిన సర్వేలో తేల్చింది. తక్కువ ఆదాయవర్గాలవారు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని, మధ్యతరగతి వర్గాల ఆదాయం పెరుగుతున్న కొద్దీ వారు బీజేపీకి ఎడం అవుతున్నారని ఈ సర్వే పేర్కొంది. మధ్యతరగతి ఓట్లలో మొత్తంగా 3 శాతం తగ్గినప్పటికీ లోక్‌సభలో మెజారిటీ సాధించలేకపోయింది. బీజేపీ పట్ల బలంగా ఉన్న 11 శాతం మధ్యతరగతి ఓటు దూరమైతే ఆ పార్టీ సమస్యలో పడుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2004లో మధ్యతరగతి ఓట్లు దూరమైనందువలన అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వం ఓడిపోయిందని వారి అభిప్రాయం. అయితే పన్ను మినహాయింపులు ప్రకటించినంత మాత్రాన మధ్యతరగతి సంతృప్తి చెందుతుందా అన్న ప్రశ్నకు జవాబు చెప్పలేము. 2024లో దేశంలో కేవలం 8.6 కోట్ల మంది మాత్రమే ఆదాయపన్నును చెల్లించారు. అయినప్పటికీ ప్రభుత్వం మధ్యతరగతి వర్గాలకు అనుకూలంగా మారిందనే అభిప్రాయం ఏర్పర్చేందుకు ఈ చర్య ఉపయోగపడింది.. అనేకమంది పేదలు మధ్యతరగతి వర్గానికి మారుతున్నారని, అందువల్ల మధ్యతరగతిని సంతోషపెట్టే చర్యలు తీసుకోవడం సరైనదేనని తెలుగుదేశం అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బడ్జెట్‌పై ఢిల్లీలో వ్యాఖ్యానిస్తూ అన్నారు. అయితే అత్యధిక సంపన్నులు అట్టడుగు వర్గాలకు చేయూతనిచ్చే మార్గాలపై చర్చ జరగాలని, జీఎస్టీని సరళీకృతం చేయాలని ఆయన సూచించారు. అదే సమయంలో సంపద సృష్టించకుండా సంపదను పంచిపెట్టే విధానాలపై చర్చించాలని ఆయన కోరారు. ఎన్డీఏలో కీలక భాగస్వామి అయిన చంద్రబాబు సూచనలను ఎన్డీఏ ప్రభుత్వం సానుకూలంగా పట్టించుకునే అవకాశాలు లేకపోలేదు.

అదే సమయంలో దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగం, ఆదాయ అసమానతలు, శ్రామిక శ్రేణుల్లో నవీన నైపుణ్యాలు కొరవడడం వంటివాటిపై కూడా వాస్తవప్రాతిపదికన ఒక రోడ్ మ్యాప్ (మార్గదర్శక ప్రణాళిక) రూపొందించాల్సిన అవసరం ఉన్నది. చట్టసభల్లో సామాన్యులు, మధ్యతరగతివారు ప్రవేశించేందుకు తగిన రాజ్యాంగ సంస్కరణలు తీసుకురావాల్సిన ఆవశ్యకత కూడా స్పష్టంగా కనిపిస్తోంది. బిలియనీర్ల సంఖ్య పెరిగిపోతోంది. చట్టసభల్లో సంపన్నుల సంఖ్య సైతం అధికమవుతోంది. ఈ పరిణామాలు వ్యవస్థలకూ ప్రజలకూ మధ్య అంతరాలకు సూచికలు కావా? కేవలం పన్ను రాయితీలు, మినహాయింపులతో ఈ అగాధాలను అధిగమించగలుగుతామా?

# చందనోత్సవం ఏర్పాట్లను పరిశీలించిన గంటా





**సింహాచలం, జయజయహే :**

ఈ నెల 30 వ తేదీన జరగనున్న సింహాచలం శ్రీ వరహా నృసింహ స్వామి వారి చందనోత్సవ ఏర్పాట్లను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. సాధారణ, ప్రత్యేక క్యూలైన్లు, దర్శనానికి పట్టే సమయం, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న క్యూ కాంప్లెక్స్ కు ప్రారంభోత్సవం చేశారు. పాత పి.ఆర్.ఓ. ఆఫీస్ వద్ద చందనోత్సవం రూ.300, రూ.1,000 ల ప్రత్యేక టికెట్ అమ్మకాలను ప్రారంభించి, భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ స్వామి వారి నిజరూపాన్ని దర్శించుకోవడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తున్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేసమయంలో సాధారణ భక్తులు ఇబ్బంది పడకుండా దర్శనం చేసుకునేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చందనం అరగదీసిన గంటా సింహాద్రి అప్పన్నను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం మంత్రోర్చనల నడుమ పండితులు శాస్త్రోక్తంగా స్వాగతం పలికి, వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం పవిత్రమైన చందనం అరగతీతలో పాల్గొని స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఈఓ కె. సుబ్బారావు, ఏఈఓ ఎన్. ఆనంద్ కుమార్, కార్పొరేటర్ పి.వి.నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, గుసిడి శంకర్రావు, మధు, అవినాష్ తదితరులు ఉన్నారు.

## ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలతో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి 14 వ ఆరాధన మహోత్సవాన్ని భక్తితో జరుపుకున్న శ్రీ సత్య సాయి భక్తులు

**విశాఖపట్నం : జయజయహే :**

భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి 14 వ ఆరాధనామహోత్సవాన్ని భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, విశాఖ జిల్లా యొక్క శ్రీ సత్యసాయి సేవా సమితి-విశాఖపట్నం సిటీ సమితి ఆధ్వర్యం లో ఎమ్.వి.పి. కోలని లోని ప్రేమసదన్ మందిరం లో భక్తి శ్రద్ధలతో వందలాది మంది భక్తులు జరుపుకున్నారు. సర్వదేవతాతీత స్వరూపులు భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో తేది 24-01-2025 గురువారం నాడు భగవాన్ బాబావారి చతుర్ధశ (14వ) ఆరాధనా మహోత్సవము ఎమ్.వి.పి. కోలనీ యందు శ్రీ సత్యసాయి ప్రేమసదన్ మందిరంలో ఈ రోజు నిర్వహించబడింది. ఈ కార్యక్రమం లో వందలాది శ్రీ సత్యసాయి భక్తులు, సేవాదళ్ సభ్యులు, శ్రీ సత్య సాయి యువత, బాలవికాస్ విభాగం వారు వివిధ పదాధికారులు మరియు ఆస్తిక మహాశయులు, పురప్రజలు అందరూ పాల్గొని శ్రీ సాయీశ్వరుని యొక్క దివ్య అనుగ్రహ ఆశీస్సులు పొందేరు. కార్యక్రమం ఉదయాన్నే ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తనతో ప్రారంభమయింది. అనంతరం ప్రేమ సదన్ మందిరం లో రుద్రాభిషేకం, శ్రీ సత్య సాయి సహస్రనామ పుష్పార్చన అనంతరం విశ్వమానవ కళ్యాణం మరియు విశ్వ శాంతి కొరకు శ్రీ సత్యసాయి గాయత్రీ విశ్వశాంతి హోమం జరిగింది. అనంతరం పూర్ణాహుతి జరిపారు. అనంతరం భగవాన్ బాబావారి చతుర్ధశ (14వ) ఆరాధనామహోత్సవము సందర్భంగా సేవా కార్యక్రమాలతో పాటు , నారాయణ సేవ( దీనులకు భోజన ప్రసాదం) అనంతరం భక్తులకు భోజన మహానారాయణ సేవ ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం వేదపఠనం, అష్టోత్తరం అనంతరం సిటీ సమితి గాయనీ గాయకులచే నామ సంకీర్తన అనంతరం శ్రీ సత్యసాయి విద్యా విహార్ మేథమెటిక్స్ డిపార్ట్మెంట్ హెడ్ భగ్గం సురేష్ చే ఆధ్యాత్మిక ఉపన్యాసం అందరినీ భక్తి పారవశ్యంలో ముంచింది. అనంతరం భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారికి మంగళహారతి తో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమం అంతా పి.ఆర్.ఎస్.ఎస్. నాయుడు, జిల్లా అధ్యక్షులు, శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, విశాఖ జిల్లా మరియు శ్రీ డి.వి.వి. సీతారామరాజు, కన్వీనర్, శ్రీ సత్యసాయి సేవా సమితి-విశాఖపట్నం సిటీ స్వయంగా సమన్వయపరిచారు. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి 14 వ ఆరాధనామహోత్సవం సందర్భంగా శ్రీ సత్య సాయి విద్యా విహార్ పదవ తరగతి విద్యార్థులు (బాలురు- బాలికలు) చే సేవా కార్యకలాపాలు నిర్వహించబడ్డాయి. ముందుగా వీధి సేవ అంటే దేవాలయాల దగ్గర ఉన్న దీనులకు, నిరాశ్రయులకు మజ్జిగ, అరటి పండ్లు, బిస్కట్ పాకెట్స్ నిరాశ్రయులకు ప్రేమతో అందచేశారు. అనంతరం (టి ఎస్ ఆర్ కాంప్లెక్స్) వద్ద ఉన్న ఆశ్రయ అనాథాశ్రమం లోని వారికి బియ్యం, కూరగాయలు, సన్ఫ్లవర్ ఆయిల్, బంగాళాదుంపలు, ఫినైల్, మినపప్పు, కందిపప్పు, ఉల్లిపాయలు, ఇడ్లీ రవ్వ, గుమ్మడికాయలు, టమోటాలు, టీ పొడి, పచ్చిమిర్చి, చక్కెర, అల్లం, బట్టలు ఉతుక్కునేందుకు పౌడర్, సబ్బు, వంకాయ, క్యాబేజీ,కాబులి శనగలు, ప్రేమతో అందచేశారు. శ్రీ సత్య సాయి విద్యా విహార్ స్కూలు ప్రిన్సిపాల్ నేతృత్వం లో స్కూలు టీచర్స్, సిబ్బంది తో కలిసి 20 మంది పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులు ఈ సేవా కార్యక్రమం లో పాల్గొన్నారు.






## ఎల్.ఐ.సి బిల్డింగ్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహం వద్ద విశాఖ నగర జనసేన పార్టీ ఆధ్వర్యంలో కన్నీటి నివాళి

- ఉగ్రదాడిలో హతమైన పర్యాటకులకు ప్రగాఢ సానుభూతి
- చంద్రమౌళి చిత్రంపటం తో నల్ల రిబ్బన్లు ధరించి మౌన ప్రదర్శన
- పాకిస్తాన్ యొక్క పిరికిపంద చర్య గా వర్ణించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు

**జయజయహే ..**

జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆదేశాలు మేరకు సంతాప దినాలులో భాగంగా విశాఖ నగర జనసేన పార్టీ అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో మౌన నిరసన కార్యక్రమం ఎల్.ఐ.సి బిల్డింగ్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహం వద్ద నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యే లు, వివిధ నియోజవర్గ ఇన్చార్జి లు, పాయింట్ ఆఫ్ కాంటాక్ట్లు, ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్ లు, జిల్లా నాయకులు, గ్రేటర్ విశాఖ కార్పొరేటర్లు , మాజీ కార్పొరేటర్ లు ,వార్డ్ అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులు, వీర మహిళలకు, పార్టీ కార్యకర్తలు, జన సైనికులు, కూటమి పెద్దలు పాల్గొన్నారు.





## ప్రజా దర్బార్ కి వచ్చిన వినతులకు 45 రోజుల గడువులోపు పరిష్కరించే దిశగా చర్యలు

- ప్రజా దర్బార్ వినతులపై సమీక్ష చేసిన వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ శ్రీ ఎం వి ప్రణవ్ గోపాల్

**జయజయహే ..**

వి ఎం ఆర్ డి ఎ నిర్వహించే ప్రజా దర్బార్ కి వచ్చిన వినతులకు సత్వరమే పరిష్కార మార్గాన్ని చూపాలని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ శ్రీ ఎం వి ప్రణవ్ గోపాల్ గారు ఆదేశించారు. గురువారం వి ఎం ఆర్ డి ఎ కార్యాలయంలో ఇప్పటివరకు వచ్చిన మొత్తం వినతులపై అన్ని విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత ప్రజా సమస్యల పరిష్కారమని, తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ఇప్పటివరకు వచ్చిన వినతులు పరిష్కారానికి ఎట్టి పరిస్థితుల్లో పరిష్కారం చూపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, న్యాయ పరమైన చిక్కులు ఉన్నవాటిని మినహాయించి, తీర్పునకు లోబడి పరిష్కరించాలని సూచించారు. విభాగాల వారీగా వచ్చిన వినతులకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. పరిష్కారం కాకపోతే అందుకు తగిన కారణాలు తెలుసుకున్నారు. ప్రజా దర్బార్ లో ఇచ్చిన అర్జీ కి 45 రోజుల్లో పూర్తి స్థాయిలో సమాధానం ఇవ్వాలని చెప్పారు. బాధితులకు నమ్మకం పెంచేలా వి ఎం ఆర్ డి ఎ ఉద్యోగులు పని చేయాలని సూచించారు. ప్రధానంగా భూ సంబంధిత వినతులు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. న్యాయ పరమైన అంశాలు ఉంటే ఆయా బాధితులకు ఆ విషయాన్ని స్పష్టం గా తెలియజేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కమీషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, డి ఎఫ్ ఓ సుజాతా శివానీ, ఎస్టేట్ అధికారి దయానిధి, ఎల్ ఏ ఓ వేణుగోపాల్, పరిపాలనాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




# జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవము

**విజయనగరం జయజయహే ..**

ఈ రోజు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న గౌరవ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) గారు ఈ సదర్భంగా గౌరవ చైర్ పర్సన్ మాటాడుతూ పంచాయతీ రాజ్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ ఎక్కడ లేని విధముగా మన పంచాయతీ రాజ్ వ్యవస్త ఉండటం గర్వ కారణం అని అందులో ప్రజాపతినిధులు గా ఉండడము మా అదృష్టంగా భావిస్తున్నాను అని తెలుపుతూ గ్రామాలను అభివృద్ధి చేయుటకు పూర్తి అధికారులు గ్రామ స్థాయిలో పంచాయతీలు కు కల్పించారు అని తెలుపుతూ ఇందులో భాగస్వామ్యములు అయిన అన్ని శాఖల ఉద్యోగుల కన్నా పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారు అని ప్రజలు తో నేరుగా సంబంధాలు కలిగిన ఉద్యోగులు అని తెలుపుతూ పంచాయతీ రాజ్ దినోత్సవము సందర్భంగా వారికి అభినందనలు తెలుపుతూ ఈ సందర్భంగా కొంతమంది సర్పంచులు కు ఉద్యోగులు కు సత్కారము చేసారు ఈ కార్యక్రమం లో జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్య నిర్వహణ అధికారి శ్రీ ఆర్. వెంకట్ రామన్ గారు, విజయనగరం, జియ్యమ్మ వలస,జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు కెల్ల శ్రీనివాసరావు గారు, మూడద్ల శశికళగారురేగిడిఆముదాలవలస వైస్ ఎం. పీ. పి టీ. అచ్చిమి నాయుడు గారు జిల్లా పరిషత్ ఉద్యోగులు అందరూ పాల్గొన్నారు



## మే నెల నుండి కొత్త వితంతు పెన్షన్లు పంపిణీ

**మాడుగుల : జయజయహే :**



రాష్ట్ర వ్యాప్తంగా మే 1వ తేదీ నుంచి వితంతువులకు కొత్త పెన్షన్లు అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకు ఎన్టీఆర్-భరోసా కింద మొత్తం 89,788 లబ్ధిదారులకు వితంతవు పింఛనులు మంజూరు చేసినట్టు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీళ్ళందరికీ మే నెల నుండి పింఛను ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. వాటిలో భాగంగా మాడుగుల నియోజకవర్గానికి 709 వితంతు పెన్షన్లు మంజూరయ్యి అన్నారు. వాటిలోమాడుగుల మండలానికి166, చీడికాడ మండలానికి 129,దేవరాపల్లి మండలానికి 157,కోటపాడు మండలానికి 197 పెన్షన్లు మంజూరైనట్టు తెలిపారు కాబట్టి కుటుంబ సభ్యులు నాయకులు గమనించాలన్నారు.

## ఘనంగా ఐకానికా సిటి ఆఫ్ గోల్డ్ శంకుస్థాపన

- బ్రోచర్ విడుదల చేసిన చిన జీయర్ స్వామి





**మధురవాడ జయజయహే :**

రుషికొండ ఐటి హిల్ నెంబర్ 3 వద్ద నిర్మించనున్న మెగా హౌసింగ్ ప్రాజెక్టు ఐకానికా సిటి ఆఫ్ గోల్డ్ కు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి గురువారం శంకుస్థాపన చేసి, బ్రోచర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 97 ఎకరాల సువిశాలమైన ఈ ప్రాజెక్టు వినియోగదారుల అభిరుచికి తగ్గట్టు అందుబాటు లోకి తీసుకురావాలని సూచించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్.సి.సి. సంస్థ అనుభవజ్ఞులైన ఐకానికా రియల్ ఎస్టేట్ కంపెనీతో కలిసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం ఆహ్వానించదగ్గ పరిణామమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కొత్తగా రానున్న టీసీఎస్, గూగుల్ వంటి దిగ్గజ ఐటి కంపెనీలు, టూరిజం, ఫార్మా ప్రాజెక్టుల వల్ల విశాఖలో నిర్మాణ రంగం ఊపందుకుంటుందని చెప్పారు. మై హోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు మాట్లాడుతూ గోవాను మించిన సముద్ర అందాలున్న విశాఖ రియల్ ఎస్టేట్ గమ్య స్థానమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐకానికా ప్రాజెక్ట్ చైర్మన్ కొట్టు మురళి మాట్లాడుతూ బెంగళూరు, హైదరాబాద్‌లలో వేల సంఖ్యలో ఫ్లాట్లు, విల్లాలు నిర్మించామని వివరించారు. కార్యక్రమంలో ఐకానికా ప్రాజెక్ట్స్ ఎండీ కె.ఎల్. సంతోష్, అల్లూరి రంగరాజు, అల్లూరి సీతారామరాజు, వేణు, కార్పొరేటర్ లొడగల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## హుకుంపేట పంచాయితీ సచివాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం



**జయజయహే ..**

ఈ సందర్భంగా సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభలో పలు అజెండా అంశాలపై చర్చించడం జరిగింది ముఖ్యంగా ప్లాస్టిక్ నిషేధంపై తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట పూర్ణిమ, సెక్రటరీ సత్యనారాయణ, హుకుంపేట మండలం సీతమ్మ, VRO రత్నకుమారి పిసా కమిటీ సభ్యులు గోవింద్ వార్డు మెంబర్స్ నూకరాజు, లక్ష్మణ్ vrp రామయ్య,హుకుంపేట మండలం నాయకులు అనిల్, రామకృష్ణ, అంగన్వాడి టీచర్స్, ఆశ వర్కర్స్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంటల సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, నాణ్యత పెరగాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్**

**బొబ్బిలి జయజయహే**

'...జిల్లాలో తలసరి ఆదాయాన్ని 15 శాతం పెంచే విధంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ప్రణాళికలను రూపొందించమే కాకుండా, వాటిని చిత్తశుద్ధితో అమలుచేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించడం ద్వారా ఇతర జిల్లాలకు మన జిల్లాను ఆదర్శంగా మార్చాలని కోరారు. నియోజకవర్గ స్థాయి అవగాహనా, మరియు సమీక్షా కార్యక్రమం బొబ్బిలిలో గురువారం జరిగింది. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ ముందుగా మాట్లాడుతూ, విజన్ ప్లాన్ లక్ష్యాలను, జీడీపీ, జీవిఏలను వివరించారు. పది సూత్రాలను, వాటిని సాధించేందుకు అవలంబించాల్సిన మార్గాలను పవర్ పాయింట్ ద్వారా తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, 2047 విజన్ ప్లాన్ అమల్లో భాగంగా జిల్లా తలసరి ఆదాయాన్ని 15 శాతానికి పెంచాలని కోరారు. మన జిల్లా పరిస్థితులను బట్టి ప్రాథమిక రంగంలోనే ఎక్కువ అభివృద్ధిని సాధించే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూమిసుమారు 3 లక్షల ఎకరాలు వరకు ఉందని, కానీ ప్రస్తుతం లక్షా,80 వేల ఎకరాలు మాత్రమే సాగు అవుతోందని, మిగిలిన భూమిని దశలవారీగా సాగులోకి తీసుకురావాలని సూచించారు. వివిధ రకాల పంటలు, అంతర్ పంటలను సాగు చేయాలని చెప్పారు. ఉద్యాన, వాణిజ్య పంటల సాగును విస్తరించడం, ఉత్పత్తిని, ఉత్పాధకతను, నాణ్యతను పెంచడం పై దృష్టి సారించాలని సూచించారు. గుడ్లు, పాలు, మాంసం ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అందుబాటులో ఉన్న చెరువుల్లో చేపల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. సేవా రంగం అభివృద్ధిలో కూడా జిల్లాలో విస్తృత అవకాశాలు ఉన్నాయని, భోగాపురం విమానాశ్రయం ఏర్పాటైతే ఈ రంగంలో అవకాశాలు ఎక్కువవుతాయని తెలిపారు. గ్రామ స్థాయి పరిస్థితులను, వనరులను పూర్తిగా అధ్యయనం చేసి, వాటికి తగ్గట్టుగా గ్రామ స్థాయి ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. మండల, గ్రామ స్థాయి అధికారుల ంతా ఈ ప్రాంతాన్ని తమ సొంత ప్రాంతంగా భావించి, వినూత్నంగా ప్రణాళికలను రూపొందించడంలో ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. 2029 సంవత్సర లక్ష్యాలు, విజన్ 2047 విజన్ ప్లాన్ లక్ష్యాల సాధనలో క్షేత్ర స్థాయి అధికారులదే కీలక పాత్ర అనీ, ప్రతీ ఒక్కరూ ఆదిశగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. వ్యవసాయశాఖ జేడీ



వి.టి.రామారావు, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ వై వి రమణ, ఉద్యానశాఖ డిడి ఏవిఎస్ వి జమదగ్ని, ఏపీఎంఐపి పిడి లక్ష్మీ నారాయణ, మత్స్యశాఖ ఇంచార్జ్ డిడి విజయకృష్ణ మాట్లాడుతూ తమ శాఖా పరమైన లక్ష్యాలను వివరించారు. సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి నూకరాజు, ఆర్డీవో రామ్మోహనరావు, ప్రకృతి వ్యవసాయం డిపిఎం ఆనందరావు, నాలుగు మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ను కలెక్టర్ తిలకించి, రైతులకు నవధాన్యాల కిట్లను చేశారు అందజేశారు..

# పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం నశించాలి బిసి విభాగం,తెలుగుదేశం పార్టీ

**శ్రీకాళహస్తి,జయజయహే.**


ప్రపంచానికి పెను ప్రమాదకరంగా మారిన వేర్పాటువాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం నశించాలని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం నాయకులు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. కాశ్మీర్ లోని పహల్గమ్ లో జరిగిన ఉగ్రదాడిలో ఏపీ వాసులైన చంద్రమౌళి, మధుసూధనరావులు మరణించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఈరోజు స్థానిక పూసల వీధి కూడలిలో వారి చిత్రపటాల ముందు కొవ్వొత్తులను వెలిగించి నివాళులు అర్పించారు. ఉగ్రవాద దాడి బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కార్యక్రమంలో పాల్గొన్నవారు మాటిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మానవ సమాజానికి పెను ముప్పుగా పరిణమించిన తీవ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయకపోతే అది మానవ మనుగడను ప్రమాదంలో పడేస్తుందని హెచ్చరించారు. కాబట్టి,ప్రపంచ లోని ఏ ప్రాంతంలో నైనా తీవ్రవాదాన్ని అంతమొందించడానికి ప్రతీ ఒక్కరూ సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి రెడ్డి వారి గురవారెడ్డి,రాష్ట్ర కార్యదర్శులు దశరధాచారి,వన్నియకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, సీనియర్ నాయకులు లక్కమనేని మధుబాబు, పేట బాలాజీ రెడ్డి, రాజేంద్రప్రసాద్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి,తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, బిసి విభాగం




శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షుడు దొరైరాజ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మునిరాజా యాదవ్, మైనారిటీ విభాగం తిరుపతి పార్లమెంటు నాయకుడు సయ్యద్ చాంద్ బాషా, నూర్ మొహమ్మద్, షేక్ రియాజ్, సులేమాన్, బిసి విభాగం నాయకులు భాస్కర్, మణి, వినయ్, మునెయ్య, సోము, చంద్ర, కృష్ణమూర్తి, రఫీ, బిజెపి నాయకులు జలగం ముని, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకల్లో నాగయ్యపేట సర్పంచ్

**దేవరాపల్లి, జయజయహే :**



జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరి సీకే కన్వెన్షన్ హాల్లో గురువారం నిర్వహించిన పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకల్లో నాగయ్యపేట సర్పంచ్ కర్రి పుష్ప పాల్గొన్నారు. ఈ వేడుకల్లో అనకాపల్లి జిల్లా నుంచి 9 మంది సర్పంచులు పాల్గొనగా, వారిలో దేవరాపల్లి మండలం నాగయ్యపేట సర్పంచ్ కు అవకాశం రావడం పై పలువురు అభినందనలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఇదే కార్యక్రమానికి జిల్లా నుంచి తొమ్మిది మంది పంచాయతీ సెక్రటరీలు పాల్గొనగా వీరిలో నాగయ్యపేట పంచాయతీ కార్యదర్శి కె.జీవన్ బాబు ఉన్నారు.

## ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమం

**దేవరాపల్లి, జయజయహే :**




మండలంలోని ఎం. అలమండ గ్రామంలోని సచివాలయం వద్ద స్థానిక సర్పంచ్ దాడి జగన్ అధ్యక్షతన గురువారం పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాడి జగన్ మాట్లాడుతూ దేశంలోనూ రాష్ట్రంలోనూ పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం జరిగితేనే గ్రామ అభివృద్ధి జరుగుతుందన్నారు. గ్రామాలు అభివృద్ధి జరగాలంటే మహాత్మా గాంధీ కన్న కలలు నిజం చేయాలని కోరారు. అనంతరం గ్రామ సభ జరిగింది. ఈ సమాజంలో నీటి సంఘం చైర్మన్ పోతల పాత్రు నాయుడు, బండారు ప్రసాదరావు, పాల సంఘం అధ్యక్షులు పొలిపిరెడ్డి రమణ, పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# అంత్యోదయ స్ఫూర్తితో చట్ట చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ పథకాలు అందాలి
# 20 సూత్రాల కార్యక్రమాలు అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్

**- జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభలలో పాల్గొన్న చైర్మన్.**
**- అరకు నియోజకవర్గ పరిధిలోని మారుమూల గ్రామాల్లో పర్యటించిన దినకర్.**
**- తన దృష్టికి వచ్చిన సమస్యలన్నిటిని సమీక్ష సమావేశంలో చర్చించి అమలు జరిగేలా చూస్తాను.**

**పాడేరు, అరకు: జయ జయహే 24 ఏప్రిల్ 2025:**

ఆధునిక సమాజానికి దూరంగా మారుమూల గిరిజన తండాలలో నివసించే చిట్ట చివరి లబ్ధిదారుడి వరకు ప్రభుత్వ పథకాలు అందినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని 20 సూత్రాల ఆర్థిక ప్రణాళిక అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. అరకు నియోజకవర్గం అనంతగిరి మండలం పైనంపాడు,అరకు వ్యాలీ మండలం కొత్త బళ్ళు కూడా పంచాయతీ పరిధిలోని సిమిలిగూడ గ్రామాల్లో జాతీయ పంచాయతీరాజ్ దివస్ సందర్భంగా జరిగిన గ్రామసభలలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి జన్మాన్ పథక లబ్ధిదారులతో సమావేశం అయిన క్షేత్రస్థాయిలో పర్యటించి జన్మన్ పథకం ద్వారా నిర్మిస్తున్న గృహాలను పరిశీలించారు. గిరిజన విద్య మరియు గ్రామీణ అభివృద్ధి సంస్థ(త్రెడ్స్) ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలను సామాన్యులకు చేరువ చేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజానికి దూరంగా జీవిస్తున్న గిరిజన తండాలు, గ్రామాల్లో ప్రజలకు మౌళిక కల్పనకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడిగా విన్నూత్న పథకాలను అమలు చేస్తున్నాయని, తద్వారా గిరిజనులకు మౌళిక వసతుల కల్పన, ప్రభుత్వ పథకాలు అందించడం వంటి కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయని, వాటిలో భాగస్వాములై ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జన్మన్ కార్యక్రమం కార్యక్రమంలో భాగంగా ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ గ్రామ పంచాయతీ పరిధిలోని కాకరపాడు, ఎగువ సో నాభ, దిగువ సోనభ, కొంగుపుట్టు, దుర్గం, పల్లి మామిడి, గ్రామాల లబ్ధిదారులు చైర్మన్ కు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రధానంగా పయనంపాడు కాకరపాడు గ్రామాల మధ్య రహదారి సరిగా లేనందువల్ల ఇటుక, ఇసుక సిమెంట్ వంటే ఇన్పుట్ తెచ్చుకోవడం చాలా కష్టంగా ఉందని, ప్రభుత్వ అధికారులు దృష్టికి తీసుకెళ్లి తమ ప్రాంతంలో రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించిన చైర్మన్ రేపు పాడేరు లో జరిగే జిల్లా రివ్యూ సమావేశంలో కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లి తక్షణం రోడ్డు వసతి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం కాకరపాడు లో ప్రధానమంత్రి జన్మాన్ కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాకరపాడు గ్రామస్తులతో సమావేశమై వారు




ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మమేకమైన ఆయనకు గ్రామస్తులు తమ అవసరాలు వారు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి చర్చించారు., తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తగిన తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని తమ జీవన ప్రమాణాలు పెంచుకోవాలని చైర్మన్ దినకర్ సూచించారు. సిమిలిగూడ గ్రామంలో పీఎం జన్మన్ ప్రభుత్వ మంజూరు పత్రాలను చైర్మన్ దినకర్ చేతులమీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎం డి ఓ తేజ పైనంపాడు సర్పంచ్ సీదిరి చెల్లెమ్మ, ఎంపీటీసీ వంతల తమన్న,వార్డు సభ్యులు కె గురుమూర్తి,మాజీ ఎంపీటీసీ సి హెచ్ బాబురావు, థ్రెడ్స్ సంస్థ ప్రతినిధి రాజు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి వి నీచ రాజకీయాలు ..బొత్స ..





**విశాఖపట్నం జయజయహే**

విశాఖపట్నం వైస్సార్సీపీ కేంద్ర కార్యాలయం లో ఉమ్మడి విశాఖపట్నం ప్రధాన నేతలు మరియు విశాఖ మహానగరం పార్టీ నేతలు కార్యకర్తలు తో పార్టీ సీనియర్ నాయకులు శాసనమండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ సమావేశం ఏర్పాటు చేసారు ముందుగా ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారికి సంతాపం తెలియజేస్తూ రెండు నిముషాలు మౌనం పాటించారు.అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గా నియంపాపడ్డ గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ మొన్న జరిగిన అవిశ్వాస తీర్మానంలో కూటమి నేతల ప్రలోభలకు లొంగకుండా,బెదిరించిన లొంగ కుండా దైర్యంగా నిలపడ్డ పార్టీ కార్పొరేటర్లు అభినందనలు తెలియజేసారు.విశాఖపట్నం జిల్లా నూతన అధ్యక్షుడు కే.కే.రాజు మాట్లాడుతూ గుడివాడ అమర్నాథ్ కి సహకరించినట్లుగానే నాకు కూడా కార్యకర్తలు,నాయకులూ సహకరించాలని, కార్యాలకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని పార్టీ అధ్యక్షుడు జగన్ గారిని మల్లి ముఖ్యమంత్రి గా చేసుకునేవరకు మనమందరం కలిసి పనిచేయాలని అన్నారు.నగర కార్పొరేట్లను విమానాలలో విడిది మలేసియా పంపి లోబరుచుకుని యాదవ కులానికి చెందిన మహిళ పదవి నుండి దింపి అవమానపర్చారని ఎలాంటి నీచ రాజకీయాలు ప్రజాసౌమ్యానానికి మంచికాదని బొత్స అన్నారు. మన నాయకుడు జగన్ నియమించిన కొత్త అధ్యక్షులకు మనం అందరం సహాయ సహకారాలు అందించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# పర్యాటకులపై ఉగ్ర చర్య హేయం



**శ్రీకాళహస్తి, జయజయహే.**

జమ్ము కాశ్మీర్లోని పహల్గమ్లో పర్యాటకులను పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు చంపడం హేయమైన చర్య అని శ్రీకాళహస్తి ప్రెస్క్లబ్ అధ్యక్షుడు డాక్టర్. కోటేశ్వర బాబు ,ప్రధాన కార్యదర్శి హరీష్ రాయల్, అన్నారు. శ్రీకాళహస్తి ప్రెస్క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పెండ్లిమండపం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సమాజానికి పెనుముప్పుగా మారిన తీవ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయకపోతే మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. తీవ్రవాదాన్ని అంతమొందించడానికి ప్రతి ఒక్కోరూ సమిష్టిగా పోరాడాలన్నారు .ఇలాంటి దుశ్చర్యలు దేశాన్ని కుదిపేయలేవని మన సైనికుల ధైర్యం, ప్రజల ఐక్యత వాటికి బలమైన సమాధానం విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ క్యాబినెట్లో తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. పాకిస్థానీలు ఇండియా లో ఎక్కడా ఉండకుండా వెళ్లిపోవాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. దీనిని ప్రపంచ దేశాలు కూడా అమలు చేసి ఉగ్రవాద నిర్మూలనకు భారత దేశానికి సహకరించాలన్నారు. ఉగ్రచర్యలో మృతి చెందిన కుటుంబాలకు మనోధైర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కె కె రాజు ను శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ జాన్ వెస్లీ



**విశాఖపట్నం జయ జయహే**

విశాఖ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె కె రాజు ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ మర్యాదపూర్వకంగా కలిసిశుభాకాంక్షలు తెలియచేసారు. కె కె రాజు నాయకత్వంలో రాబోయే ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని మరల అధికారంలోకి తీసుకువచ్చే విధంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సంఘటితంగా కలిసి పనిచేయాలని చర్చించారు . ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ షరీఫ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ సిటీ అధ్యక్షులు సనఫల రవీంద్ర భరత్ మరియు విశాఖ దక్షిణ నియోజకవర్గం వైయస్సార్సీపి యువజన విభాగం అధ్యక్షులు తాడి రవితేజ, శివ పాల్గొని వైస్సార్సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె కె రాజు కు శుభాకాంక్షలు తెలిపారు.

## భూముల రీ సర్వే ప్రక్రియ పక్కాగా చేయండి

**- డి డి, డిఎల్ బిఎల్ కుమార్**





**పాడేరు,జయ జయహే ఏప్రిల్ 24 :**

భూముల రీ సర్వే ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని సర్వే ఉప సంచాలకులు డిఎల్ బిఎల్ కుమార్ ఆదేశించారు. గురువారం కలక్టరేట్ సమావేశ మందిరంలో ఆరు మండలాల తహసిల్దార్లు, గ్రామ రెవిన్యూ ఆఫీసర్లు, ఆర్ ఎస్ డిటిలు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లతో వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ నోటిఫికేషన్ సర్టిఫికేట్ జారీ చేయడంలో మన జిల్లా వెనకబడి ఉన్నదని తెలిపారు. జిల్లాలో రీ సర్వేకు 1012 గ్రామాలు ఉండగా అందులో 504 గ్రామాలకు 13వ నోటిఫికేషన్ సర్టిఫికేట్ జారీ చేయగా 508 పెండింగ్ లో ఉన్నాయని పేర్కొన్నారు. చీఫ్ కమీషన్ లేండ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డైరెక్టర్ ఆఫ్ సర్వే సెటిల్మెంట్ ఉత్తర్వుల మేరకు ఈ వర్క్ షాపు నిర్వహిస్తునట్లుని తెలిపారు. ప్రతి గ్రామ సర్వేయరును మరియు విఆర్ఓను లాగ్ ఇన్ చేయడంలో ఉన్న సమస్యలు తెలుసుకొని పరిష్కారాలు తెలియజేశారు. గైరుహాజరైన విఆర్ ఓలు మరియు విఎస్ లకు షో కాజు నోటీసు జారీచేయాలని ఆదేశించారు. క్రమశిక్షనా లోపం వల్లనే పనులు జాప్యం అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి విఆర్ ఓ కు మరియు విఎస్ రీ సర్వే ప్రక్రియ అవగాహన ఉండాలని ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియ మొత్తం క్లుప్తంగా వివరించారు. 13వ నోటిఫికేషన్ సర్టిఫికేట్ జారీ చేసిన తర్వాత మళ్ళీ గ్రీవెన్స్ కు సర్వే నంబరు వస్తే విఆర్ ఓలు మరియు విఎస్ లదే బాధ్యతని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ క్వార్టర్ ఇన్స్పెక్టర్ ఎస్.నాగేశ్వర రావు, ఎడి సర్వే హెడ్క్వార్టర్ ఎం. రంగప్రసాదు, సీనియర్ ఇన్స్పెక్టర్ రాజమండ్రి వై. మోహనరావు, ఎడి సర్వే కే. దేవేంద్రుడు మరియు డివిజనల్ ఇన్స్పెక్టర్ జి. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ పై మిశ్రమ దాణా సద్వినియోగపరచుకోండి

**మాడుగుల, ఏప్రిల్ 24**



పాడి పశువులకు వాడే దాణా ఖర్చు తగ్గించడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాడి పశువులు కలిగిన రైతులకు 50% సబ్సిడీ పై మిశ్రమ దాణా అందుబాటులోకి తెచ్చినట్టు మాడుగుల పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ సహాయ సంచాలకులు డాక్టర్ వి చిట్టినాయుడు గురువారం తెలిపారు. ఈ పథకంలో తెల్ల రేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు కేజీ ధర రూ. 22.21 కాగా 50 కేజీల మిశ్రమ దాణా బస్తా ఖరీదు 1100/- రూపాయలు అన్నారు. అయితే 50% సబ్సిడీ పై 550/- రూపాయలకు పాడి రైతులకు అందిస్తుందన్నారు. ఈ పథకంలో ఒక పాడి రైతుకు ప్రస్తుతం 50 కేజీ ల నుండి 100 కేజీల వరకు సబ్సిడీ పై దాణా ఇవ్వబడునన్నారు.రైతు సేవా కేంద్రాల ద్వారా కాని, పశు వైద్యశాలల్లో సిబ్బంది ద్వారా గాని అవసరమైనా రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు రైతులు దగ్గరలోని పశువైద్య శాలను లేదా రైతు సేవా కేంద్రంలోని పశుసంవర్ధక సహాయకున్ని కానీ సంప్రదించాలన్నారు.

## ఉగ్ర దాడిని ఖండించిన కాంగ్రెస్ పార్టీ



**మాడుగుల ఏప్రిల్ 24**

కాశ్మీర్ రాష్ట్రంలో అనంతనాగ జిల్లాలో తీవ్రవాదులు హిందువులపై జరిపిన దాడి పైశాచికమని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. గురువారం ఆ పార్టీ మాడుగుల నియోజవర్గ ఇన్చార్జి పడాల కొండలరావు, పార్టీ నాయకులు యేసు రాజు దేవిద్రాజు అప్పారావు, తదితరులు మాట్లాడుతూ ఇలాంటి చర్యలు క్షమించరానివన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు వారుకి సంతాపం తెలుపుతూ వాళ్ళ ఆత్మను శాంతి చేకూరాలనికోరారు. ఇలాంటి సంఘటనలు కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో దాడి చేసిన వారినీ గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

## ఉగ్రవాదుల దాడి క్షమించరానిది

**-జనసేన నేత రాజు**



**చోడవరం,ఏప్రిల్ 24**

జమ్మూ కాశ్మీర్లో పెహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన 27 మంది భారత పౌరులు ఆత్మకు శాంతి కలగాలని అలాగే ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని గురువారం చోడవరం జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేస్తూ మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ పీవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఉక్కుపాదంతో ఉగ్రవాదులను అణచివేయాలని కోరారు.ఈ సందర్భంగా దేశం యావత్తు కేంద్ర ప్రభుత్వం వెనుక అండగా ఉంటుందని ఈ క్రమంలో భవిష్యత్తులో మరే ఇతర పౌరుడు ప్రాణం కోల్పోకుండా సైన్యానికి మరిన్ని అధికారాలను ఇవ్వడం ద్వారా పాకిస్థాన్ దుర్మార్గాలను అరికట్టమే కాకుండా ఉగ్రవాదుల పీచం అణచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండకాల పార్టీ అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేస్తాం




**-జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్**

**పాడేరు జయ జయహే ఏప్రిల్ 24:**

ప్రాధాన్యతా క్రమంలో గ్రామ పంచాయతీలకు మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. డి. గొందూరు గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం నిర్వహించిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత పంచాయతీ పథకంలో ఎంపికైన 15 గ్రామాల్లో డి. గొందూరు పంచాయతీ ఉందన్నారు. పంచాయితీ అవసరాలను గుర్తించి గ్రామ సభ లో తీర్మానం చేసి ప్రతిపాదనులు పంపిస్తే అవసరమైన మంజూరులు చేస్తామన్నారు. పంచాయతీ నిధులు, లైన్ డిపార్టుమెంటులో అందుబాటులో ఉన్న నిధులతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. మహిళలు పొందిన బ్యాంకు లింకేజీలు సద్వినియోగం చేసుకుని వ్యాపారాలు చేయాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని చెప్పారు. నిరుద్యోగ యువత వ్యసనాలకు బానిస కాకుండా ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డీ ఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళా పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ప్రధాన మంత్రి జన్ మన్ పథకంలో 15 మంది లబ్దిదారులకు గృహ మంజూరు పత్రాలను పంపిణీ చేసారు. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం రూ.2.39 లక్షల నిధులు విడుదల చేస్తోందన్నారు. లబ్దిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మాణాలు చేయాలని సూచించారు.

**మినుములూరు లో గ్రామ సభ**

జిల్లా పంచాయతీ అధికారి బి. లవరాజు మినుములూరులో గ్రామసభనిర్వహించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు.ఈ సమావేశంలో గ్రామ వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పి. ఎస్.కుమార్, గృహ నిర్మాణ శాఖ ఇ ఇ బి. బాబు, ఈ ఓ పి ఆర్ డి రమేష్, నీతి ఆయోగ్ బృందం చైతన్య రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సర్పంచ్ సీదరి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్దులు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించండి





**-సూపర్ 50 విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రశంసలు ఐటిడి ఏ ఇంచార్జి పి. ఓ, జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ**


**పాడేరు జయ జయహే ఏప్రిల్ 24**

గిరిజన విద్యార్థులు నిర్దేశించు కున్న లక్ష్యాలను సాధించాలని ఐటిడి ఏ ఇంచార్జి పి. ఓ. జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ అన్నారు. పది ఫలితాల్లో సూపర్ 50 విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారని విద్యార్థులను ఉపాధ్యాయులను ఆయన ప్రశంసించారు. గురువారం ఐటిడి ఏ సమావేశ మందిరంలో సూపర్ 50 విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ 50 రూప కర్త పూర్వపు పి ఓ వి. అభిషేక్ ను ప్రత్యేకంగా అభినందించారు. గిరిజన విద్యార్థుల విద్యా ప్రగతికి బాటలు వేసారని అన్నారు. భవిష్యత్తులో సూపర్ 50ని కొనసాగిస్తామన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సూపర్ 50 విద్యార్థులకు ఐటిడి ఏ అండగా ఉంటుందన్నారు. కాలేజే ఆఫ్ ఎక్స్ లెన్సు ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధించిన విద్యార్థులు ఈ స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. బాలికలు డిగ్రీ పూర్తి చేసి ఉన్నతంగా స్థిరపడే వరకు వివాహానికి దూరంగా ఉండాలని చెప్పారు. ఆరోగ్యం మీద ప్రత్యేకంగా శ్రద్ద పెట్టాలన్నారు. 50 ?? విద్యార్దును, ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను పి. ఓ సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు ఆసోషియేషన్ తరుపున కె. గంగా భవాని, త్రినాధు ఒక్కొక్కరికి రూ.1116లు నగదు బహుమతిని అందజేసారు. ఈ కార్యక్రమంలో ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఎల్.రజని , ప్రధానోపాధ్యాయులు జి.వి.వి. ప్రసాద్, టి. నాగేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తలిదండ్రులు, సూపర్ 50 విద్యార్థినీ విద్యార్దులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగుల భార్యలకే కుట్టు మిషన్ల పంపిణీనా..!?

**పిఠాపురం, జయ జయహే :**

నేడు జరగబోయే పిఠాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాలకు నియోజకవర్గ పరిధిలో శంకుస్థాపనలు చేయనున్నారు. అందులో భాగంగానే స్థానిక రథాల పేట సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ భవన్లో ఇప్పటిదాకా మహిళలకు కుట్టు మిషన్లు శిక్షణ ఇచ్చి నేడు పవన్ కళ్యాణ్ రాకతో ఆయన చేతుల మీదుగా ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ కార్యక్రమం చేయనున్నారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగుల భార్యలు కుట్టుమిషన్లు అందుకునే వారిలో ఉన్నట్టు, ఇప్పటికే వారి యొక్క పేర్లతో నమోదైన లిస్టు ప్రిపేర్ చేయడం జరిగిందని తెలిసింది. ప్రభుత్వ పథకాలు కేవలం ప్రభుత్వ అధికారుల లేక ప్రభుత్వ ఉద్యోగ కుటుంబాలకే పరిమితమా అన్న ప్రశ్న పిఠాపురం నియోజకవర్గంలో చక్కర్లె కొడుతుంది. పిఠాపురం నియోజకవర్గం దేశవ్యాప్తంగా మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా అన్న పవన్ వ్యాఖ్యలు కేవలం ప్రభుత్వ ఉద్యోగుల భార్యలకే సొంతం కావడం హాస్యాస్పదం. దీనిపై ప్రత్యేక కమిటీని నియమించి అధికారులు సక్రమంగా పనిచేసి లబ్ధిదారులకు మాత్రమే పథకాలు అందే విధంగా కృషి చేయాలని నియోజకవర్గ శ్రేయోభిలాషులు అభిలాషిస్తున్నారు.



# జీవ వైవిధ్యం కాపాడాలి
# పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా






**పిఠాపురం, జయ జయహే :**

మూగ జీవులకు మండు వేసవిలో తిండి గింజలు ఆహారముగాను మరియు కొద్దిగా ఒక పాత్రలో కొద్దిగా నీరు పోసి జీవ వైవిధ్యం కాపాడాలని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా పిలుపునిచ్చారు. గురువారం ఉదయం కాకినాడ బోట్ క్లబ్ వద్ద గల కవి శేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారి విగ్రహ ప్రాంగణంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పక్షుల చలివేంద్రం, మజ్జిగ చలివేంద్రం మరియు పశువుల చలివేంద్రంలను పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడలో ఉన్న శ్రీ రామకృష్ణ అద్వైత ఆశ్రమం వేదాంత ఆచార్య స్వామి కృష్ణానంద, బావర్లాల్ జైన్, రమేష్ జైన్, అంబాలాల్ జైన్, రిటైర్డ్ ఆర్టీవో రామచంద్ర రావు, తురగా సూర్యారావు, స్టేట్ మైనారిటీ సెల్ వైస్ చైర్మన్ ఎండి జహురుద్దీన్ జిలానీ, ఉమర్ ఆలీషా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ హుస్సేన్ షా ముఖ్య అతిథులుగా పాల్గొని పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అమృత హస్తములతో మజ్జిగ స్వీకరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి మాట్లాడుతూ వేసవిలో క్రమం తప్పకుండా మజ్జిగ స్వీకరించుట ద్వారా శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉండి, ఆరోగ్యం కాపాడు కొనవచ్చును అని అన్నారు. స్వామి కృష్ణానంద మాట్లాడుతూ డాక్టర్ ఉమర్ ఆలీషా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు మహోన్నతమైనది అని స్లాగిస్తూ, మానవ కల్యాణం కొరకే కాకుండా, జీవరాశి మనుగడ కోసం ప్రయత్నిస్తున్న మీ కార్యకర్తలకు కూడా భగవంతుడు ఆశీస్సులు లభిస్తాయని అన్నారు. పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 104 ఆశ్రమ శాఖల ద్వారా 9 లక్షల మంది సభ్యులు మంచినీటి, మజ్జిగ, పక్షుల, పశువుల చలివేంద్రంలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బావర్లాల్ జైన్, విజయ్ జైన్, ఎం.ఎస్.ఎన్ చారిటీస్ రిటైర్డ్ ప్రిన్సిపల్ కాశిన వెంకటేశ్వరరావు విశిష్ఠ దాతలుగా వ్యవహరించారు. పక్షుల చలివేంద్రం నిర్వాహకులు పేరూరి సన్యాసిరావు, అన్నపూర్ణ దంపతులు, మజ్జిగ చలివేంద్రం నిర్వాహకులు కొజ్జవరపు వీరభద్రరావు, అమ్మాజి దంపతులు, పశువుల చలివేంద్రం నిర్వాహకులు మరిసే నాగేశ్వరరావు మరియు కాకినాడ ఆశ్రమ శాఖ కన్వీనర్ కాకినాడ లక్ష్మి పాల్గొన్నారు. యువ మండా మోహన్ కృష్ణ , మండా ఉమా మాహేశ్వరి, మహేంద్ర వర్మ, భార్గవ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం 25 ఏప్రిల్ 2025
జయ జయహే

# ఉగ్రదాడిపై మండిపడుతున్న ప్రజలు



-ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలంటూ డిమాండ్
-హిందువులారా ఐక్యంగా ఉండండి
-మన వద్దనే ప్రమాదం పొంచి ఉంది

**మాడుగుల ఏప్రిల్ 24**

కాశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడిపై ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తూ మండిపడుతున్నారు. దాడుల కారణమైన ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకున్న విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గురువారం రాత్రి మాడుగుల్లో ఉగ్ర దాడికి నిరసనగా పెద్ద ఎత్తున కొవ్వతులతో నిరసన ప్రదర్శన చేపట్టి బస్టాండ్ లో మానవహారం ఏర్పాటు చేసి ఉగ్రవాద చర్యలను ఖండించారు. కేవలం మతాన్ని ఆధారంగా తీసుకొని ఇలాంటి చర్యలు చేపట్టడం మంచి పద్ధతి కాదని ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ నేపద్యంలో కులాలు ముఖ్యం కాదని హిందువులంతా ఐక్యంగా ఉండాలన్నారు. ప్రమాదం ఎక్కడో జరిగిందని భావించవద్దని ఈ ప్రమాదం దేశమంతా పొంచి ఉందని, మన దగ్గర కూడా పొంచి ఉందని చెప్పారు కాబట్టి ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని అనుమానితులపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి దుచ్చర్యలు మరోసారి జరక్కుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని దేశ ప్రజలకు ఒక భరోసా ఇవ్వాలని కోరారు. ఇది ఒక ప్రభుత్వం వల్ల సాధ్యం కాదని ప్రజలంతా ఐక్యంగా ఉండాలని హిందుత్వంపై నినాదించాలని పిలుపునిచ్చారు. మన్యం జ్యోతి సేవా సంఘం అధ్యక్షుడు ఎం సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి తవ్వ సన్యాసి శెట్టి , బిజెపి నాయకుడు పుట్ట గంగయ్య, మండల సతీష్,ఎస్ రామ్మూర్తి తదితరులు ఉగ్రదాడిని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏసీబీ దాడిలో పట్టుబడిన ట్రాన్స్కో ఏఈ





-రైతు విద్యుత్ కనెక్షన్ ఎస్టిమేషన్ కోసం 17వేలు డిమాండ్
-ఏసీబీ ని ఆశ్రయించిన రైతు బి నరసింహారావు
-ఏసీబీ డీఎస్పీ బివిఎస్ఎస్ రావణమూర్తి ఆధ్వర్యంలో గురువారం రాత్రి దాడి
-లంచం తీసుకుంటుండగా ట్రాన్స్కో ఏఈ ని పట్టుకున్న ఏసీబీ అధికారులు
-గతంలో ఇదే సబ్ స్టేషన్ లో లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కిన అప్పటి ఏఈ

**మక్కువ, ఏప్రిల్ 24, (జయజయహే):-**

మక్కువ ట్రాన్స్కో లో అవినీతి జాడ్యం కొనసాగుతూనే ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన ట్రాన్స్కో అసిస్టెంట్ ఇంజనీర్ రైతు బోరు బావికి విద్యుత్ కనెక్షన్ మంజూరు కొరకు అధిక మొత్తం డబ్బులు డిమాండ్ చేయడంతో సదరు రైతు ఏసీబీ అధికారులకు పట్టించిన సంగతి విధితమే..! ఈ సంఘటన మరువక ముందే మక్కువ విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ట్రాన్స్కో అసిస్టెంట్ ఇంజనీర్ డి జోగి నాయుడు గురువారం రాత్రి ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడిలో లంచం తీసుకుంటుండగా పట్టు పడ్డారు. వివరాల్లోకెళ్తే.. విజయనగరంలో నివాసముంటున్న బి నరసింహమూర్తి అనే వ్యక్తికి మక్కువ మండలం సరావలస రెవెన్యూ గ్రామంలో భూములు కలిగి ఉన్నారు. సదరు భూములలో ఏర్పాటు చేసుకున్న బోరు బావికి విద్యుత్ కనెక్షన్ నిమిత్తం మక్కువ ట్రాన్స్కో అసిస్టెంట్ ఇంజనీరింగ్ అధికారిని సంప్రదించగా.. ఎస్టిమేషన్ నిమిత్తం 17వేల రూపాయలు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఏసీబీ డిఎస్పి బి వి ఎస్ ఎస్ రామమూర్తిని బాదితుడు ఈ నెల 22వ తేదీన ఆశ్రయించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు వలపన్ని 24వ తేదీ గురువారం రాత్రి 7 గంటల సమయంలో మక్కువ విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ కనెక్షన్ కొరకు ఎస్టిమేసన్ వేసేందుకు 17 వేల రూపాయలు బాధిత రైతులు నుండి లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. లంచం డిమాండ్ చేస్తూ పట్టుబడిన మక్కువ ట్రాన్స్కో అసిస్టెంట్ ఇంజనీర్ డి జోగినాయుడు ను అరెస్టు చేసి శుక్రవారంనాడు విశాఖపట్నంలో గల ఎసిబి కోర్టు లో హాజరుస్తామని తెలిపారు. ఈ దాడిలో విజయనగరం శ్రీకాకుళం ఏసీబీ సీఐ మహేష్ తో పాటు భాస్కర్ పాల్గొన్నారు.

# అయ్యా ! ఆక్రమించుకున్న మా ఇంటి స్థలాలు ఇప్పించండి





**దొరవారిసత్రం జయ జయహే**

అయ్యా..మేము నిరుపేద దళితులము మాకు ప్రభుత్వం గతంలో సర్వే నంబరు 44 లో ఇచ్చిన నివేశ స్థల పట్టా భూమిని నేడు ఓ ధనవంతుడు ఆక్రమించుకున్నాడు.మాకు ఇచ్చిన ఇంటి పట్టా స్థలాలను ఇప్పిచ్చుండంటూ ఓ దళిత మహిళ కలెక్టర్ వెంకటేశ్వర్ పాదాలపై పడి తన గోడును వినిపించింది.గురువారం ఆయన దొరవారిసత్రం మండల కేంద్రంలోని పలు కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేపట్టిన సందర్భంగా పట్టాలు పొంది,స్థలం%శ్రీ% కోల్పోయిన పలువురు దళితులు,కళాకారులతో పాటు ఈ సమస్యను బి ఎస్ పి లీడర్ శంకరయ్య, తెలుగుదేశం నాయకులు రాఘవయ్య,కృష్ణమూర్తి ఆక్రమిత భూ సమస్యను క్షుణ్ణంగా వివరించారు. ఓ అగ్రవర్ణ, ధనికుడు గత వైసిపి ప్రభుత్వంలో ఆక్రమించుకొని నేడు అక్రమ కట్టడ నిర్మాణం చేపట్టాలని సన్నాహాలు చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.పట్టాలు పొంది నివేశ స్థలం కోల్పోయిన నిరుపేదలకు న్యాయం చేయాలని కోరారు అంతేకాకుండా రెడ్డిగుంట చెరువుకు నీరు రాకుండా పంట కాలువను కూడా దౌర్జన్యంతో నామరూపాలు లేకుండా చేశారని తెలియజేశారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించి,పట్టాలు ఉన్న నిరుపేదలకు భూమి చూపించాలని ఆర్డీవో కిరణ్మయికి ఆదేశించారు. అదేవిధంగా పంట కాలువ ఆక్రమణలు తొలగించి యధావిధిగా తక్షణం కాలువ ఏర్పాటు చేయాలని కూడా తెలియజేశారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి పట్టాలు ఉన్న వారికి భూమి చూపించి,న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు

# అభివృద్ధి పనులపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





-మీ ఇంటి నిర్మాణంలో ఇలాగే చేస్తారా...?
-"కలెక్టర్ వెంకటేశ్వర్"

**దొరవారిసత్రం జయ జయహే**

పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సద్వినియోగం ఎలా అవుతున్నాయి అన్నదానిపై తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం దొరవారిసత్రం మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.బాలికల వసతి సౌకర్యాలకు ప్రభుత్వం 40 లక్షల నిధులను విడుదల చేయడం జరిగింది.దీనిపై కలెక్టర్ హాస్టల్లోని మౌలిక వసతులు అభివృద్ధి విషయంలో ప్రతి గదులను మరుగుదొడ్లు , స్నానపు గదులు,త్రాగునీటి సరఫరా తో పాటు భవనం పై భాగంలో స్లాబ్ ను పరిశీలించారు. పనులు నత్త నడకలో నడవడం ఆశించిన మేర నాణ్యత పనులు కనిపించక పోవడంతో ఏఈ కళ్యాణ్ ను తీవ్రంగా మందలించారు,టైల్స్ ఏర్పాటు అస్తవ్యస్తంగా ఉండటం చూచి మండి పడ్డారు. స్నానపు గదులు ప్రాంతంలోనే వరుస క్రమంలో నీటి కొళాయిలను ఏర్పాటు చేయాలని సూచించారు. లోపల ఆవరణం అస్తవ్యస్తంగా ఉండడం చూచి దీన్ని సరిచేసుకుని షటిల్ కోర్ట్ పిల్లలకు ఏర్పాటు చేయాలని సూచించారు.అదేవిధంగా భోజనశాలను పరిశీలించారు.పిల్లలకు అవసరమైన త్రాగునీరు ఆర్ ఓ వాటర్ ఏర్పాటు చేయకుండా ఇంకనూ పాతకాలపు పద్ధతులు డ్రమ్ముల్లో నీళ్ళు ఏర్పాటు చేయటం ఏమిటని ఏ ఎస్ డబ్ల్యు,వార్డెన్ ను హెచ్చరించారు.వెంటనే.పిల్లలకు ఆర్వో వాటర్ సదుపాయం కల్పించాలని హెచ్చరించారు. విడుదలైన నిధులను సక్రమంగా సకాలంలో నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఈ ఈ కి ఆదేశించారు.అభివృద్ధి పనులు ఆశించిన మేర అక్కడ కనిపించక పోవడంతో కలెక్టర్ కొంత అసహనం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ డీ ఓ కిరణ్మయి తహసిల్దార్ పి శైలా కుమారి,ఎంపీడీవో గోవర్ధన్.ఐసిడిఎస్ సూపర్వైజర్ హేమలత అగ్రికల్చర్ ఏవో,జ్యోతిర్మయి,ఆర్ ఐ ప్రవీణ్ రాయల్,వీఆర్వో అయ్యప్ప హౌసింగ్ ఏఈ మోహన్ , తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే గ్రామాల్లో పర్యటించిన జెసి



**మాడుగుల ఏప్రిల్ 24**

మాడుగుల మండలంలో వివిధ గ్రామాల జరుగుతున్న భూ రిసర్వే కార్యక్రమాలను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి పరిశీలించారు. ఈ సందర్భంగా కేజీపురం కామకూటం గ్రామాల్లో సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా తగు సూచనలు చేశారు. అనంతరం కూర్మనాథపురం వెళ్లి అక్కడ నెలకొన్న భూ సమస్యపై స్థానికలతో రైతులతోనూ చర్చించారు. అనంతరం మాడుగుల మాలకొండ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు ఈ సందర్భంగా ఆలయ కమిటీ తరపున పుప్పాల రమేష్ జెసిపి జ్ఞాపిక అందజేశారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రమాదేవి, డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చింతా వెంకటనారాయణమూర్తి, బొడ్డేటి మోది నాయుడు,జే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు కె కె రాజు కు అభినందనలు వెల్లువ..



**విశాఖపట్నం జయ జయహే**

వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా నూతన అధ్యక్షులుగా నియమితులయిన కె.కె రాజు ను మర్యాదపూర్వకంగా కలిసి విశాఖ ఉత్తర నియోజకవర్గం బీసీ సెల్ ప్రెసిడెంట్ బొడ్డేటి గంగా మహేష్ మరియు ద్వారం సంతోష్ కుమార్ ,విమల్, మోహన్, భాస్కర్,పార్టీ నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో సంతాప దీక్ష :



**జయ జయహే**

జమ్ము కాశ్మీర్ లోని బైసరన్ ప్రాంతంలో ఉగ్రవాద దాడిలో మృతులకు సంతాపం తెలియజేస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజుల సంతాప దినాలలో భాగంగా రెండవ రోజున పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ ఆధ్వర్యంలో పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి జనసేనకేంద్ర కార్యాలయం వద్ద సంతాప దీక్ష చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఆకేటి గోవిందరావు, జిల్లా సహాయ కార్యదర్శి కురందాసు అప్పలరాజు, ఉపమాక పంచాయతీ అధ్యక్షులు పాము గణేష్, జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేషన్ సభ్యులు పిక్కి స్వామి, యలమంచిలి చంద్రరావు, బత్తిన గోవిందరావు, రాజు బంగారి, ఏరిపల్లి చిన్న, తులసి, మంగబాబు తదితరులు పాల్గొన్నారు.

## కాలేషాను పరామర్శించిన సీపీఐ నాయకులు



**గూడూరు, ప్రతినిధి, ఏప్రెల్ 24,**

గూడూరు రెండవ పట్టణంలోని సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషాను ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్ పరామర్శించారు. ఇటీవల ఆరోగ్యం సరిలేక చెన్నైలో కాలేషా చికిత్స పొందారు. కొన్నిరోజులుగా స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. కాలేషా భాయ్ ను పరామర్శించిన వారిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జీ. శశి కుమార్, చిల్లకూరు కార్యదర్శి జీ. రమేష్, ఇన్సాఫ్ రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్ జమాలుల్లా ఉన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com